



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






విజయవాడ VIJAYAWADA | సంపుటి : 24 | సంచిక : 224 | ది. 12-11-2025 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

Vol.No : 24 | Issue No : 224 | Date : 12-11-2025 | Wednesday | Pages : 8 | Rs.1/-


# ఉదారంగా ఆదుకోండి

- మొంథా తుపానుతో రాష్ట్రానికి రూ.6,384 కోట్ల నష్టం
- ముందస్తు ప్రణాళికతో ప్రాణ నష్టం జరగకుండా కాపాడాం
- గత పాలకులు విపత్తు నిధిని ఖాళీ చేశారు
- మొంథా తుపాను నష్టంపై అంచనాకు వచ్చిన కేంద్ర బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆర్టీజీఎస్ వ్యవస్థ ద్వారా నష్టాన్ని తగ్గించారని సీఎంను కొనియాడిన కేంద్ర బృందం



**అమరావతి,నవంబర్ 11 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ కు మొంథా తుపాను కారణంగా వాటిల్లిన నష్టంపై త్వరితగతిన నివేదిక ఇచ్చి ఉదారంగా ఆదుకునేలా సిఫార్సు చేయాలని కేంద్ర బృందాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. తుపాను కారణంగా ఇళు ,, రహదారులు, విద్యుత్ స్తంభాలు, పంటలు, ఆక్వా, చేనేత రంగాలు దెబ్బతిన్నాయని అన్ని రంగాల్లో మొత్తంగా రూ.6384 కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్టు కేంద్ర బృందానికి సీఎం వివరించారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో తుపాను నష్టంపై అంచనాకు వచ్చిన కేంద్ర హెూంశాఖ సంయుక్త కార్యదర్శి పాసుమీ బసు నేతృత్వంలోని కేంద్ర బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైంది. క్షేత్రస్థాయిలో జరిపిన పరిశీలనల్ని సీఎం దృష్టికి తీసుకువచ్చింది. రెండు బృందాలుగా వేర్వేరు ప్రాంతాల్లో పర్యటించి తుపాను నష్టాన్ని అంచనా వేశామని వివరించింది. కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో వేర్వేరు ప్రాంతాలను సందర్శించనట్టు తెలిపింది. మొంథా తుపాను, భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టంపై రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రజంటేషన్ ద్వారా కేంద్ర బృందానికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 443 మండలాల్లోని 3,109 గ్రామాలు మొంథా తుపాను కారణంగా ప్రభావితం అయ్యాయని ప్రభుత్వం నివేదికలో పేర్కొంది. దాదాపు 10 లక్షల మంది తుపానుతో పాటు భారీ వర్షాలకు ప్రభావితం అయ్యారని వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 9,960 ఇళ్లు నీట మునిగాయని 1.11 లక్షల కుటుంబాలు నిరాశ్రయులయ్యారని ప్రభుత్వం పేర్కొంది. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు 4,566 ఇళ్లు దెబ్బతిన్నట్టు వివరించింది. 1.61 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతిందని.. 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారని కేంద్ర బృందానికి నివేదించింది. వ్యవసాయ పంటలతో పాటు ఆక్వా, పశు సంవర్ధకం, చేనేత రంగం కూడా తీవ్రంగా నష్టపోయినట్టు వెల్లడించింది. 4,794 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని, 12,856 విద్యుత్ స్తంభాలు నేల కూలినట్టు తెలిపింది. అలాగే 2,318 విద్యుత్ ట్రాన్సఫార్మర్లు పాడయ్యాయని నివేదికలో పేర్కొంది. మొంథా తుపాను వల్ల నష్టపోయిన ప్రజల్ని ఆదుకునేందుకు 22 జిల్లాల్లో 1.92 లక్షల మందిని రిలీఫ్ క్యాంపులకు తరలించామని ప్రభుత్వం వెల్లడించింది. మొత్తం 3.36 లక్షల కుటుంబాలకు రూ.3 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయంగా అందించినట్టు కేంద్ర బృందానికి వివరించింది. రాష్ట్రంలో రహదారులు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలను తక్షణం పునరుద్ధరించేందుకు తక్షణ సాయంగా రూ.2,622 కోట్లను మంజూరు చేయాల్సిందిగా ప్రభుత్వం కేంద్ర బృందానికి నివేదించింది.

**త్వరితగతిన సాయం వచ్చేలా చూడండి..** రాష్ట్రంలో జరిగిన తుపాను నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించినందున త్వరితగతిన నివేదిక ఇచ్చి రాష్ట్రాన్ని ఆదుకోవాలని సీఎం కేంద్ర బృందాన్ని కోరారు. ఏపీ నుంచి రెండు రోజుల్లో తుది అంచనాలను కూడా పంపుతామని తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్ర బృందం.. త్వరితగతిన కేంద్రానికి సిఫార్సులు చేస్తామని వెల్లడించింది. ఆర్టీజీఎస్ నుంచి ముందస్తు హెచ్చరికలు పంపి సరైన సమయంలో విలువైన ప్రాణాల్ని కాపాడగలిగారని కేంద్ర బృందం ముఖ్యమంత్రిని కొనియాడింది. రెస్క్యూ బృందాలను, వనరుల్ని ముందుగానే పంపి ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించారని అభిప్రాయపడింది. గర్భిణుల్ని కూడా ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించి వైద్యసేవలు సత్వరం అందేలా చూసిన విషయాన్ని కూడా గుర్తించామని కేంద్ర బృందం సీఎంకి తెలిపింది.

# ఆలోచనతో రండి.. అవకాశాలు అందుకోండి

- పెట్టుబడులకు అనువుగా 175 నియోజకవర్గాల్లో ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కులు
- ఎంఎస్ఎంఈల ద్వారా 5 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల ఎంఓయూలు
- కేంద్రం ఏ పాలసీ తెచ్చినా మొదట అమలు చేసేది ఏపీనే
- 2026 నాటికి వెలుగొండ పూర్తిచేసి ప్రకాశం జిల్లాకు నీళ్లిస్తాం
- కనిగిరి ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 17 జిల్లాల్లో వర్చువల్‌గా పారిశ్రామిక పార్కుల ప్రారంభించిన సీఎం





**కనిగిరి,నవంబర్ 11 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. యువత ఆలోచనలతో ముందుకు వస్తే పారిశ్రామిక యూనిట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చేయూత ఇస్తుందని ప్రకటించారు. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లోనూ ప్లగ్ అండ్ ప్లే విధానంలో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. విద్యుత్తు, నీటి సరఫరా, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను ఈ పార్కుల్లో కల్పిస్తూ పెట్టుబడులకు అనువుగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెదఈర్లపాడులో ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి ప్రారంభించారు. దీంతో పాటు 17 జిల్లాల్లో ఏర్పాటు చేసిన మరో 49 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. 868 ఎకరాల విస్తీర్ణంలో రూ.873 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టులను పరిశ్రమల శాఖ చేపట్టింది. పారిశ్రామిక పార్కుల్లో భూమి పొందిన 1597 ఎంఎస్ఎంఈ సంస్థలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు సీఎం చేశారు. వీటితో పాటు రాష్ట్రంలో రూ.25,256 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన 38 వివిధ మెగా పారిశ్రామిక యూనిట్లను కూడా ముఖ్యమంత్రి వర్చువల్ గా ప్రారంభించారు. అనంతరం శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కర్నూలు, అనంతపురం, చిత్తూరు తదితర జిల్లాల్లోని పారిశ్రామిక పార్కుల్లో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వేత్తలతోనూ సీఎం వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

**సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల ఎంఓయూలు..** పరిశ్రమలకు అనువైన వాతావరణం, పాలసీలు రాష్ట్రంలో ఉన్నాయి. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులకు ప్రభుత్వం తగిన చేయూత అందిస్తుందని సీఎం అన్నారు. ఈ అంశంపై మాట్లాడుతూ "నేడు 99 కంపెనీల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నాం. వీటి ద్వారా రూ.2.65 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చి 2 లక్షల మందికి పైగా యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు వస్తాయి. జనవరికి మరో 70 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభిస్తాం. 175 నియోజకవర్గాల్లోనూ పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి ప్రతీ కుటుంబంలోనూ ఒక ఔత్సాహిక పారిశ్రామిక వేత్తను తయారుచేస్తాం. భవిష్యత్ అంతా టెక్నాలజీదే. క్వాంటం కంప్యూటింగ్ జనవరికి అమరావతిలో ప్రారంభం అవుతుంది. ప్రపంచానికి క్వాంటం కంప్యూటర్లను మన రాష్ట్రం నుంచి ఉత్పత్తి చేసి పంపించేలా పరిస్థితి మారుతుంది. సౌర విద్యుత్ ఉత్పత్తిని ఇంటి నుంచే తయారు చేసుకునేలా ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నాం. రిలయన్స్ బయో ఫ్యూయెల్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది. తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసేలా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తున్నాం. డ్రోన్ సిటీని ఓర్వకల్లులో ఏర్పాటు చేస్తున్నాం. సివిలియన్, డిఫెన్స్ అప్లికేషన్ల కోసం డ్రోన్లను ఇక్కడే తయారు చేస్తాం. రాష్ట్రానికి సెమీ కండక్టర్ పరిశ్రమ కూడా త్వరలోనే ఏర్పాటు అవుతోంది. 14,15వ తేదీల్లో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు చేసుకోబోతున్నాం. ఈ ఒప్పందాల ద్వారా 8 లక్షలకు పైగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**గత ప్రభుత్వంలో పరిశ్రమలు మూతపడ్డాయి..** గత పాలనలో పరిశ్రమలు మూతపడ్డాయని .. పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోయారని ముఖ్యమంత్రి అన్నారు. ఈ అంశంపై సీఎం మాట్లాడుతూ"చెత్త నుంచి సంపద సృష్టించడమే ఇప్పుడు కొత్త విధానం. కొత్తగా ఏర్పాటు అవుతున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు దీనిని అందిపుచ్చుకోవటం సంతోషదాయకం. దీనిద్వారా రాష్ట్రంలోని రైతులకు ప్రయోజనం కలుగుతుంది. పారిశ్రామిక పార్కుల్లో విద్యుత్, నీళ్లు, రహదారులు వంటి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నాం. ఉద్యోగాలు ఇవ్వటం కాదు... పారిశ్రామికవేత్తగా చేస్తామని చెప్పి ఇప్పుడు దానిని నిరూపిస్తున్నాం.

# కార్యకర్తే అధినేత

- పార్టీలో ప్రతీ ఒక్క కార్యకర్తకూ న్యాయం జరగాలి
- అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు గ్రీవెన్స్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలి
- నెలాఖరులోగా అన్ని పార్టీ, నామినేటెడ్ పదవులూ భర్తీ చేస్తాం
- ఇంఛార్జ్ మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో జోనల్ కోఆర్డినేటర్లు సమన్వయం చేసుకోవాలి
- ప్రతిపక్షంలో ఉన్నప్పటి కంటే ఇంకా బలంగా పనిచేయాలి
- టీడీపీ జోనల్ కోఆర్డినేటర్లకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దిశానిర్దేశం




**అమరావతి,నవంబర్ 11 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అధినేతలని, వారందరికీ న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు, ఇంఛార్జ్ మంత్రులు, జోనల్ కోఆర్డినేటర్లదేనని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పష్టం చేశారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయ%శీ% ఎన్టీఆర్ భవన్ లో మంగళవారం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జోనల్ కోఆర్డినేటర్లతో నారా లోకేష్ భేటీ అయ్యారు. పార్టీకి కార్యకర్తే అధినేత అనే టీడీపీ విధానం పక్కాగా అమలు కావాలని, ఆ దిశగా ప్రతీ కార్యకర్తకు పార్టీలో ప్రాధాన్యం ఉండేలా చూడాలని జోనల్ కోఆర్డినేటర్లకు తేల్చి చెప్పారు. అధికారంలో ఉన్నామనే నిర్లక్ష్యం వద్దే వద్దని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత కసిగా పనిచేశారో, అంతకంటే ఎక్కువ పట్టుదలతో పనిచేసి కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. ఇంఛార్జ్ మంత్రులతో సమన్వయం చేసుకుంటూ స్థానిక ఎన్నికల వ్యూహరచన చేయాలని జోనల్ కోఆర్డినేటర్లకు ఆదేశాలు ఇచ్చారు. జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న చోట తెలుగుదేశం ఇంఛార్జ్ ల సమన్వయం ఎంతో కీలకం అని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గానికి వెళ్లి పార్టీ వ్యవహారాలపై జోనల్ కోఆర్డినేటర్లు సమీక్షించాలని సూచించారు. ఎమ్మెల్యేలకు, కార్యకర్తలకు సమన్వయం పెంచే బాధ్యత జోనల్ కోఆర్డినేటర్లదేనని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యేలు తప్పనిసరిగా గ్రీవెన్స్ నిర్వహించి, అర్జీలు తీసుకుని వారి స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. వైసీపీ ఐదేళ్లలో పెట్టిన అక్రమ కేసులపై సమీక్షించి చట్టపరంగా పరిష్కరిద్దామన్నారు. పెండింగ్ లో ఉన్న అన్ని పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు త్వరితగతిన భర్తీ చేస్తామని లోకేష్ చెప్పారు. జోనల్ కోఆర్డినేటర్లు స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి నియోజకవర్గాలలో క్లస్టర్, యూనిట్, బూత్, కుటుంబ సాధికార సారథులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యేలు, ఇంఛార్జ్‌లు పెన్షన్ల పంపిణీ, గ్రీవెన్స్, క్యాడర్ మీటింగ్స్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలలో తప్పని సరిగా పాల్గొనే విధంగా చూడాలన్నారు. వీటన్నింటిపైనా జోనల్ బాధ్యులు ఇచ్చిన నివేదికలు అధిష్టానం సమీక్షిస్తుందని తెలిపారు. ప్రమాద బీమా చెక్కులు తగిన సమయంలోనే బాధిత కుటుంబ సభ్యులకు అందజేయాలని కోరారు. పార్టీ డైరెక్షన్‌లోనే ప్రతి నాయకుడు పనిచేసే విధంగా చూడాలన్నారు.

# సంక్షేమం, సంపద సృష్టి.. అదే ప్రభుత్వ లక్ష్యం..!

- జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ మరియు చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత
- జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలతో కలిసి.. ప్రకాశం జిల్లాలో సీఎం పాల్గొన్న 'పరిశ్రమలు - ఉపాధి కల్పన' వర్చువల్ కార్యక్రమానికి హాజరు
- జిల్లాలో రూ.4,322 కోట్ల పెట్టుబడులతో 1179.64 ఎకరాల్లో 7 పరిశ్రమల యూనిట్ లకు శంకుస్థాపనలు






**కడప,నవంబర్ 11 (వార్తాప్రభ) :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగిస్తూ.. స్థానిక వనరులతో సంపదను సృష్టించే ప్రణాళికలు, ముందుచూపుతో రాష్ట్ర ముఖ్యమంత్రి ముందుకు వెళుతున్నారని.. జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ మరియు చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ప్రశంసించారు. మంగళవారం 'పరిశ్రమలు – ఉపాధి కల్పన'లో భాగంగా ప్రకాశం జిల్లా కనిగిరి పరిధిలోని పెదఈర్లపాడులో ఎంఎస్ఎంఈ పార్కుతో పాటు.. రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాలలోని 50 ఎంఎస్ఎంఈ పార్కులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం జరిగింది. కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో వీక్షిస్తూ.. స్థానిక కలెక్టరేట్ సభాభవన్ నుండి కడప జిల్లాలో రూ.4,322 కోట్ల పెట్టుబడులతో 1179.64 ఎకరాల్లో 7 పరిశ్రమల యూనిట్ లకు శంకుస్థాపనలు చేసే కార్యక్రమానికి.. ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ మరియు చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి లతో పాటు ప్రభుత్వ విప్ లు జమ్మలమడుగు శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డి, కడప శాసన సభ్యురాలు ఆర్. మాధవి రెడ్డిలు, కమలాపురం శాసన సభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, ఏపిఐఐసి డైరెక్టర్ ప్రసాద రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి సవిత మాట్లాడుతూ.. అభివృద్ధే ధ్యేయంగా.. అడుగులేస్తున్న ప్రభుత్వం మనది. ఒకవైపు ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తూ.. మరొకవైపు సంపదను సృష్టిస్తూ.. లక్షలాదిమందికి.. ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా.. వనరులను సమకూరుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ముందుచూపు ఉన్న గొప్ప నాయకుడు అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో చుస్తే.. పారిశ్రామిక రంగాన్ని ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్ది.. ప్రపంచ వ్యాప్తంగా రాష్ట్రానికి అత్యధిక సంఖ్యలో పెట్టుబడులను ఆకర్షిస్తున్న విజన్ ఉన్న నాయకుడు.. మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులనుఏర్పాటు చేసి స్థానిక యువతకు పుష్కలంగా ఉపాధి అవకాశాలను అందించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం అన్నారు. ఈ రోజు జిల్లాలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు శిలాఫలకాలు ఆవిష్కరించడం జరిగిందన్నారు. వచ్చే సంవత్సరంలోగా ఆయా పార్కుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను సమకూర్చి స్థానిక ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు యూనిట్లు నెలకొల్పుకునే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రత్యేకించి.. వైఎస్ఆర్ కడప జిల్లాకు అపారమైన సహజ వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు.


**IN THE COURT OF I ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION) : VIJAYAWADA**

O.S. 454/2023

BETWEEN :

STATE BANK OF INDIA, Gurunanaknagar Branch, Vijayawada
Rep by its Branch Manager
--------Plaintiff

AND

Polapavarapu Jayaram son of Prakash, C/o. KMV Projects, NTR Health University, Siddhartha Medical College, Gunadala, Vijayawada-8
--------Defendant

Defendants take suit summons in the above suit filed against you, by the bank for realization of the suit amount of Rs.2,02,332/- under the loan account no.38349025337 and the said suit stands posted to 16-12-2025 for your appearance. Appear before the Hon'ble Court on that day at 10.30 A.M., Personally or through an Advocate. Else next step follows.

// By Order //

**T.V.N.VASUDEVA RAO**
Advocate for Plaintiff.
Gudivadavari Street,
Vijayawada-1

**IN THE COURT OF THE 1st ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION) : VIJAYAWADA**

O.S. 1524/2024

Between :

T. లక్ష్మి కుమారి ----వాది
మరియు
T. నాగభూషణం ---ప్రతివాది

To,
తురకా నాగభూషణం
S/o T. నాగరాజు R/o, D.No. 3-51, గుండిమెడ గ్రామం, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా–522303

ఈ దావాలో ప్రతివాది అయిన తురకా నాగభూషణం కోర్టు వారి ముందు హాజరగుటకు గాను ది.27-11-2025వ తేదీన వాయిదా అయి ఉన్నది. ది.27-11-2025వ తేదీన ఉ.10.30 గంటలకు పై కోర్టు వారి ముందు హాజరై తమ ఆక్షేపణలను తెలియపరచుకోవలెను. లేని యెడల తమ పరోక్షమున విచారించి తీర్మానించబడును. కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయడమైనది.

**N. BHAVANI PRASAD**
M.A., M.B.A., M.Sc., LL.M.
Advocate
# 58-1-26, Veerapaneni Plaza
Patamata, Vijayawada-520 010


# రైతుల పంటలకు మెరుగైన ధర అందించడమే ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ లక్ష్యం

- ప్రతీ మండలంలోనూ 'నైబర్హుడ్ వర్క్ ప్లేస్' ఏర్పాటు
- రైతుల పొలాల్లో సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటుద్వారా రైతులకు అదనపు ఆదాయం
- నూజివీడు మండలం మొర్సపూడి లో రూ. 102 కోట్లతో ఏర్పాటుచేయనున్న రమణసింగ్ గ్లోబల్ ఫుడ్ పార్క్ పనులకు శంఖుస్థాపన చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి



**నూజివీడు, నవంబర్ 11 (వార్తాప్రభ) :** రైతులు తాము పండించే పంటలకు మెరుగైన ధరను కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి అన్నారు. కనిగిరిలో రాష్ట్ర ముఖ్యమంత్రివ ర్యులు 60 పారిశ్రామిక ప్రాజెక్టులు మరియు 51 ఎంఎస్ఎంఈ లు ప్రారంభోత్సవంలో భాగంగా ఏలూరు జిల్లా నూజివీడు మండలం మొర్సపూడి లో 102 కోట్ల రూపాయలతో ఏర్పాటుచేయనున్న రమణసింగ్ గ్లోబల్ ఫుడ్ పార్క్ ను పనులను మంగళవారం ముఖ్యమంత్రి వర్చ్యువల్ గా శంఖుస్థాపన చేయగా, నూజివీడు మండలం మొర్సపూడి లో రమణసింగ్ గ్లోబల్ ఫుడ్ పార్క్ పరిశ్రమకు మంగళవారం రాష్ట్ర గృహ నిర్మాణ, సమా చార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి శంఖు స్థాపన చేశారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి మొర్సపూడి లో రమణసింగ్ గ్లోబల్ ఫుడ్ పార్క్ పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్ధసారధి మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రాన్ని వ్యవసాయకంగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు విజన్ కలిగిన నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అలుపెరగని కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు 20 కొత్త పారిశ్రామిక పాలసీలు తీసుకువచ్చామని, అందులో ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ ఒకటన్నారు. వ్యవసాయరంగాన్ని పారిశ్రామికరంగంతో సమ్మిళితం చేసి ఆహార ఉత్పత్తులతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేయడం ద్వారా రైతులకు వారు పండి ంచే పంటలకు మరింత మెరుగైన ధర అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. రైతులకు తాము పండించిన పంటలకు గిట్టుబాటు లేని పరిస్థితిని ఎన్నటికీ రానీయకుం డా రైతుల అవసరాలను ముందుగానే తెలుసుకుని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునే ప్రభుత్వం తమదన్నారు. రమణసింగ్ గ్లోబల్ ఫుడ్ పార్క్ ఏర్పాటుద్వారా 700 మంది యువతకు ప్రత్యక్షంగా, 1500 మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. సంక్షేమం తో తోపాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యతను ముఖ్యమంత్రి ఇస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం గత ప్రభుత్వం కన్నా ఎక్కువగా సంక్షేమ లబ్ధిని ప్రజలకు అందిస్తూనే, అభివృద్ధికి కృషిచేస్తున్నదన్నారు. ఈనాటి యువత ఉద్యోగం కోసం నిరీక్షించడం నుండి మరొకరికి ఉద్యోగం అందించే స్థాయికి తీసుకువెళ్లడమే స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యమన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మనరాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవవనరులు అధికంగా ఉన్నాయన్నారు.

## శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ ఉత్సవాలకు రంగం సిద్ధం

-డాక్టర్ పసుపులేటి అంజయ్య నాయుడు జయశ్రీ దంపతులు



**విస్సన్నపేట,నవంబర్ 11 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో నూజివీడు రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సాక్షాత్తు శ్రీ మానసా దేవి స్వరూపిణి దేవాలయం నందు 26వ తేదీన బుధవారం కళ్యాణ మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పసుపులేటి అంజయ్య నాయుడు జయశ్రీ దంపతులు తెలియజేశారు. స్వస్తిశ్రీ చంద్రమానేన శ్రీ విశ్వా వాసు నామ సంవత్సర మార్గశిర మాస శుద్ధ షష్టి అనగా 26వ తేదీ బుధవారం పది గంటల 16 నిమిషాలకు శ్రవణా నక్షత్ర యుక్త మకర లగ్న పుష్కరాంశము నందు శ్రీ స్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా అంగరంగ వైభవంగా జరుపబడుతుందని వారు తెలియజేశారు. బుధవారం ఉదయం ఐదు గంటల 15 నిమిషాలకు స్వామివారి అభిషేకములు తమ కుటుంబం నిర్వహిస్తామని తదుపరి భక్తులు అభిషేకములు నిర్వహించిన అనంతరం స్వామివారికి అలంకరణ జరుగుతుందని ఎనిమిది గంటల 15 నిమిషాలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ మండపారాధన, అఖండ దీపారాధన 10 గంటల 16 నిమిషాలకు స్వామివారి కళ్యాణం నభూతో నభవిష్యతి అన్న చందంగా చూసినవారికి చూడముచ్చటగా జరపడం జరుగుతుందని వారు తెలియజేశారు. కళ్యాణం అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతోందని పాల్గొన్న భక్తులు స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నామన్నారు. స్వామి వారి కళ్యాణ పీఠాల పైన కూర్చొని వారు అర్చక స్వామిని 93911 90291 నెంబర్ కు సంప్రదించవలసినదిగా విజ్ఞప్తి చేశారు. శుద్ధ షష్టి శుభదినమున అన్న ప్రసాద వితరణకు మరియు దేవస్థాన అభివృద్ధి కొరకు విరాళాలు అందించే భక్తులు 07760898179 850027718 నంబర్లకు సంప్రదించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## గాయకులు రాజబాబుపై ప్రశంసల జల్లులు

-అలరించిన రాజబాబు "భక్తి సంగీత గీతాలాపన"



**కాకినాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** ప్రముఖ ఆధ్యాత్మిక కళాతోరణమైన గోకులంలో కార్తీకమాస పర్వదిన సందర్భంగా ఆలయ ధర్మకర్త శ్రీ నారాయణం మురళి,వారి సతీమణి శ్రీమతి హిమబిందు ల ఆధ్వర్యంలో లక్ష దీపార్చన మహోత్సవం లో ఆకాశవాణి గాయకులు, వ్యాఖ్యాత అయిన శ్రీ కరక రాజుబాబు చే నిర్వహించబడిన వ్యాఖ్యానంతో పాటు "భక్తి సంగీత గీతాలాపన" కార్యక్రమం ఆద్యంతం వీక్షించిన భక్తులు భక్తి పారవశ్యంలో తేలియాడేలా సాగింది. ఈ వేడుకకు హాజరైన పలువురు ప్రముఖులు,భక్తులు, గాయకులు రాజుబాబు పై ప్రశంసల జల్లు కురిపించారు.అనంతరం ఆలయ ధర్మ కర్త,యెన్.సి.ఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ నారాయణం మురళి,వారి సతీమణి శ్రీమతి హిమబిందు దంపతులు రాజుబాబు దంపతులకు తీర్థప్రసాదాలనందించి,నగదు బహుమతితో సత్కరించారు.

## న్యాయపోరాటం చేస్తానన్న గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు



**విసన్నపేట,నవంబర్ 11 (వార్తాప్రభ) :** పదిమంది సంతోషం కొరకు తనను తాను అర్పించుకుంటూ తన ఆస్తులను అమ్మి ప్రతిఫలాపేక్ష లేకుండా రిటర్న్ గిఫ్ట్ ఆశించకుండ ప్రజా సేవ చేస్తున్న తనపై సోషల్ మీడియాలో వ్యక్తిత్వహరణ పోస్టులు పెట్టడం పట్ల స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ఆర్.బి.ఎస్ జాతీయ అధ్యక్షులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు మీడియాకు తెలియజేశారు. 102 ఎకరాల భూమిని తమ తండ్రిగారైన గోటేటి వెంకటేశ్వర రావు ఇస్తే ప్రస్తుతం 9 ఎకరాలు 75 సెంట్లు మాత్రమే మిగిలిందని బడులు గుడులకు రహదారులకు చర్చిల నిర్మాణాలకు సొంత భూములు అమ్మి ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. ప్రజా ఉపయోగం కొరకు పోలీసు స్టేషన్ కు సీసీ కెమెరాల ఏర్పాటుకు 90 వేల రూపాయలు వితరణగా అందించానని ఏ తప్పు చేయకపోయిన నాపై సోషల్ మీడియాలో తప్పుడు మెసేజీలు పెడుతున్నారని వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకోవాలని మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావుతో సంయుక్తంగా ఎస్ ఐ రామకృష్ణకు ఫిర్యాదు చేశామన్నారు. ట్రైనీ ఎస్ ఐ ఉమామహేశ్వర రెడ్డి పాల్గొన్నారు. తప్పుడు సమాచారం పోస్టులు పెట్టిన వారిపై పరువు నష్టం దావా వేసేందుకు న్యాయ సలహాలు తీసుకుంటున్నామన్నారు.

## స్మాల్ పత్రికల సమస్యలను పరిష్కరించండి

● సమాచార శాఖా మంత్రి పార్థసారథి, డైరెక్టర్ విశ్వనాథన్ కు ఆంధ్రప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ వినతి



**అమరావతి,నవంబర్ 11 (వార్తాప్రభ) :** స్మాల్ దినపత్రికలకు ప్రెస్ అక్రిడేషన్లు పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, డైరెక్టర్ కె.ఎన్. విశ్వనాథన్ లను కోరారు. ఈ మేరకు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారికి అందజేశారు. ప్రెస్ అక్రిడేషన్ల ప్రక్రియకు వెబ్ సైట్ ప్రారంభించిన సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. జీవో నెంబర్ 84 / 2025 వల్ల తగ్గిన అక్రిడేషన్లు పెంపు ,నియోజకవర్గాల వారీగాజారీ , 2018సం.నుండి ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న బిల్లులు చెల్లింపు , రేటు కార్డు పెంచి అమలు ,తక్షణమే స్లాబ్ రేటు పెంపు,ఎంప్యానల్మెంట్ పెండింగ్ ఫైళ్ళు పబ్లికేషన్ సెంటర్, ప్రింటింగ్ ప్రెస్ చిరునామాలు ,ఓనర్ షిప్ మార్పు పోస్టల్ లైసెన్స్ లాంటి కొన్ని మినహాయింపులతో పరిష్కారం, కొత్తగా ఎంప్యానెల్ మెంట్ ప్రక్రియ ,ఎంప్యానల్మెంట్ లేని దినపత్రికలు, పిరియాడికల్స్ కు యాడ్స్ విడుదల తదితర సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. వాటిపై మంత్రి, డైరక్టర్ స్పందిస్తూ కొన్ని పరిష్కరిస్తామని , మరికొన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. వెబ్ సైట్ ను ప్రారంభించిన సందర్భంగా మంత్రిని సత్కరించబోయే సరికి మిమ్మల్ని సత్కరిస్తానంటూ ఆ దుస్సాలువాను తీసుకొని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వల్లూరు ప్రసాద్ కుమార్ ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వల్లూరు ప్రసాద్ కుమార్, నందిగం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విశ్వేశ్వరస్వామి వారి సన్నిధిలో మంత్రి వాసంశెట్టి సుభాష్





**విశాఖపట్నం,నవంబర్ 11 (వార్తాప్రభ) :** పవిత్ర కార్తీక మాసం సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం ఉదయం జగదాంబ జంక్షన్ సమీపంలోని శ్రీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానమును సందర్శించి పరమశివునికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజర్ అడపా దేముళ్ళు మంత్రి వాసంశెట్టికి దేవస్థానం వద్ద ఘన స్వాగతం పలికారు.వాసంశెట్టి శ్రీ విశ్వేశ్వరస్వామి వారికి విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయ ఇంచార్జి ప్రధాన అర్చకులు బాదంపూడి విశ్వేశ్వరరావు, బాదంపూడి సదాశివ,బాదంపూడి ప్రసాద్ లు మంత్రిచే ప్రత్యేక పూజలు చేయించారు. మంత్రికి పరివెట్టం చుట్టి పండిత ఆశీర్వచనం చేసారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ రావి చెట్టు చెంతన ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని దీపారాధన చేశారు. ఆలయం లో దాదాపు అరగంటకు పైగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజర్ అడపా దేముళ్ళు, ఉద్యోగి రామారావులు మంత్రికి ఘన వీడ్కోలు పలికారు.

## ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



**హనుమాన్ జంక్షన్,నవంబర్ 11 (వార్తాప్రభ) :** మద్దాయి కుంట జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం, అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యులు దారపు రెడ్డి భాస్కరరావు అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. 1888 సంవత్సరం నవంబర్ 11న అబుల్ కలాం జన్మించారని స్వాతంత్ర సమరయోధులలో, గొప్ప పండితుల్లో మరియు ధార్సనికు ల ల్లో ఈయన ఒకరిని, హిందూ ముస్లింల ఐక్యత కోసం మహాత్మా గాంధీ అత్యంత సన్నిహితులుగా ఉంటూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రజలలో విప్లవాత్మక భావాలను రగిలించారు. స్వతంత్ర అనంతరం భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా విశేష సేవలు అందించారు. ఆయన దృష్టిలో విద్య అనేది ప్రతి పౌరుడు జన్మహక్కని,నిర్బంధ విద్య అవసర మని, అత్యున్నత విద్యాలయాలైన విశ్వవిద్యాలయాలు, సాంకేతిక ఉద్యానైనా ఐఐటీలకు ఆయన కాలంలోనే పునాదులు పడ్డాయి. మహిళా విద్య పై, గ్రామీణ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, విద్య ఒక్కటే సమాజంలో సమానత్వ సాధనకు తోడ్పడే ఆయుధమని ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలని సూచించారు 1992 సంవత్సరంలో భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డు ఇచ్చింది. భారత కేంద్ర ప్రభుత్వం 2008వ సంవత్సరం నుంచి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవం గా జరపాలని ప్రకటించింది. ఆయన కలం పేరు ఆజాద్ అనగా స్వేచ్ఛ జీవి అని అర్థం ఆయన నడిపిన ఉర్దూ పత్రిక పేరు ఆల్ హిలాల్ నేటి విద్యార్థులైన మీరు బాగా చదువుకుని అబుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా ఉన్నత స్థితికి రావాలని భాస్కర్ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు జె పద్మ, బి జాన్సన్, టీ యువరాజు, ఏ అనురాధ,బి జ్యోతి, పి నాగేంద్రరావు, యు శివ నాగరాజు, పి డేనియల్, టిటి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఆర్‌డీసీ డైరెక్టర్‌గా నక్కా శ్రీను బాధ్యతలు స్వీకరణ



**విజయవాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** విజయవాడలోని రోడ్లు & భవనాల శాఖ ఈఎన్‌సీ కార్యాలయంలో యర్రగొండ పాలెం నియోజకవర్గానికి చెందిన ఐటిడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నక్కా శ్రీను ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ) డైరెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రివ ర్యులు బీసీ జనార్ధన్ రెడ్డి, ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మేనేజింగ్ డైరెక్టర్ ఎల్. శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో నక్కా శ్రీను ప్రమాణస్వీకారం చేశారు.మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో రోడ్ల డెవలప్మెంట్ కార్పొరేషన్ కీలక పాత్ర పోషిస్తుందని, దీని అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన కృషి అపారమని తెలిపారు. ముందుచూపు కలిగిన నిర్ణయాలతో రాష్ట్ర రోడ్ల అభివృద్ధికై డైరెక్టర్లు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం ప్రకాశం జిల్లా అధ్యక్షులు, టూరిజం చైర్మన్ డాక్టర్ నూకాసాని బాలాజీ, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొని నక్కా శ్రీను ను అభినందించారు.యర్రగొండపాలెం నియోజకవర్గంలో ని ఐదు మండలాల అధ్యక్షులు, నేతలు కూడా పాల్గొని శుభాకాంక్షలు అందించారు. ప్రమాణస్వీకారం అనంతరం నక్కా శ్రీను మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాపైన ఉంచిన నమ్మకం పట్ల తన కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను అభివృద్ధి మార్గంలో తీసుకెళ్లడానికి కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. బీసీలకు పెద్దపీట వేస్తున్న చంద్రబాబు కి తెలుగుదేశం ప్రభుత్వానికి, తనకు మద్దతుగా నిలిచిన చింతకాయల విజయ్ కి, డాక్టర్ నుకాసాని బాలాజీ కి, గూడూరి ఎరిక్షన్ బాబు కి ధన్యవాదాలు తెలిపారు..

## కాకినాడ నగరంలో కుక్కల బెడద నివారణకు చర్యలు - ఇన్‌చార్జ్ కమిషనర్ సుధాకర్



**కాకినాడ, నవంబర్ 11 (వార్తాప్రభ) :** కాకినాడ నగరంలో కుక్కల బెడద నివారణకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ కెటి సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన బాహ్య పర్యటనలో భాగంగా ఎన్టీఆర్ నగర్ సమీపంలోని ఏబిసి (Animal Birth Control) సెంటర్‌ను హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దళే పృథ్వి చరణ్‌తో కలిసి పరిశీలించారు. రోజువారీగా ఎన్ని కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు జరుగుతున్నాయి, షెల్టర్‌లో ఎన్ని కుక్కలు ఉన్నాయన్న వివరాలను స్వయంగా పరిశీలించారు. ఏబీసీ కేంద్రంలోని ఆపరేషన్ థియేటర్‌ను కూడా పరిశీలించిన ఇంచార్జ్ కమిషనర్, అక్కడి సౌకర్యాలపై స్నాప్ ఏజెన్సీ హెడ్ శ్యామ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రోజుకు 20 నుండి 25 కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు జరుగుతున్నట్లు ఏజెన్సీ హెడ్ శ్యామ్ కమిషనర్కు తెలియజేశారు. కేంద్రం స్థలం తక్కువగా ఉండటం వల్ల దీన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని గుర్తించిన ఇంచార్జ్ కమిషనర్, సదుపాయాల పెంపుపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కమిషనర్ సుధాకర్ మాట్లాడుతూ కాకినాడ నగరంలో కుక్కల సంఖ్యను తగ్గించడంలో ఏబీసీ ఆపరేషన్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని, ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తూ మరిన్ని ఆపరేషన్లు చేయడానికి అవసరమైన వసతులను మరింతగా మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ఇంచార్జ్ కమిషనర్‌తో పాటు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, స్నాప్ హెడ్ శ్యామ్, డిఇ ఆదినారాయణ, శానిటరీ ఇన్స్పెక్టర్ ధర్మాజీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ అడ్డుకొని తీరుతాం మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామి దాస్



**తిరువూరు,నవంబర్ 11 (వార్తాప్రభ) :** తిరువూరు మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ 15వ వార్డులో కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ ఆధ్వర్యంలో మరియు కోర్టు ఆవరణలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాసు పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను ప్రైవేటీకరణ చేస్తే పేద ప్రజలకు వైద్యం భరోసా ఉండదు పెద్దపెద్ద జబ్బులు వచ్చినప్పుడు ప్రవేటు హాస్పిటల్లో పేదలు లక్షల రూపాయలు పెట్టి వైద్యం చేయించుకోలేరు ఈ కూటమి ప్రభుత్వం వచ్చాక మూస లాంటి టూరిజం పేరుతో పెద్ద పెద్ద కంపెనీలకు అతి తక్కువగా భూములు ఇస్తూ పేద ప్రజలకు ఉచిత వైద్యం లేదంటున్నారు వైద్యం ప్రైవేటుపరం చేస్తామంటున్నారు ఇది ఎంతవరకు న్యాయం ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను ప్రైవేటీకరణ కాకుండా పెద్ద ఉద్యమం తీసుకొచ్చి పోరాడుతామని జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లుగా కోటి సంతకాల సేకరణ ద్వారా కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేస్తామని స్వామి దాస్ వెల్లడించారు

## కోటి సంతకాల సేకరణలో వైసీపీ బిజీ బిజీ



**విస్సన్నపేట,నవంబర్ 11 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్ లో పట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పట్టణ పార్టీ అధ్యక్షులు ఎన్ వి కుటుంబరావు నాయకత్వంలో కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రకాష్, ఎంపీటీసీ సభ్యులు గద్దల మల్లయ్య,విక్రమ్, బోనం మహేశ్వరరావు, నాంచారయ్య, నందమూరి సుబ్బారావు,బాజీ, షరీఫ్,నటరాజ్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి టీడీపీ ఆర్థిక సాయం



**తోట్లవల్లూరు,నవంబర్ 11 (వార్తాప్రభ) :** ఆపదలో ఉన్నవారికి టీడీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు మట్టా అమృత బాబు పేర్కొన్నారు. మండలంలోని చాగంటిపాడులో నిమ్మకూరి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదేశాలతో టిడిపి మండల అధ్యక్షులు వీరపనేని శివరాం రూ .10 వేల రూపాయలను ఆర్థికసాయంగా అందజేశారు. శివరాం పంపిన నగదును పార్టీ నాయకుడు అమృతబాబు మృతుడు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. మృతుని కుటుంబానికి అండగా నిలిచిన వీరపనేని శివరాంకు స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి, జనసేనకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వద్దు బ్రో





**గుంటూరు,నవంబర్ 11 (వార్తాప్రభ) :** గుంటూరు టి జె పి ఎస్ కళాశాల జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో చల్లావారి పాలెంలో ఏర్పాటు చేసిన వారం రోజుల ప్రత్యేక శిబిరం లో భాగంగా ఈరోజు "మత్తు పదార్థాలు –నివారణ " అనే అంశం పైన ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబ శివరావు తెలియచేశారు. ఈ కార్యక్రమానికి ఈగల్ డిపార్ట్మెంట్ నుండి సబ్ ఇన్స్పెక్టర్ కె సునీల్ బాబు గారు విచ్చేశారు. వీరు మాట్లాడుతూ మత్తు పదార్థాలు మానవుని శరీరాన్ని విషతుల్యం చేస్తాయని, ఆల్కహాల్, గంజాయి, కొకైన్, పొగాకు, తంబాకు వంటి వలన మానవుడు తనలోని మనిషి తత్వం మరచి, రాక్షసుడిగా మారతాడని, ఆ క్షణంలో సాటి మనుషులతో క్రూరంగా ప్రవర్తిస్తాడని చెప్పారు. అంతే కాకుండా కుటుంబ సంబందాలను కలుషితం చేసి నేరస్తుడుగా మారతాడని చెప్పారు. ముఖ్యంగా యువత వీటికి దూరంగా ఉండటమే కాకుండా సమాజంలో ప్రజలకు మత్తు పదార్థాలు వాడడం వలన జరిగే నష్టాలు గురుంచి అవగాహనా కలిగించాలని తెలియచేశారు. స్టేట్ యూత్ ఆఫీసర్ బి రాధిక మాట్లాడుతూ చిన్న చిన్న పిల్లలు కూడా మత్తుపదార్థాలకు బానిసలుగా మారుతున్నారని, తద్వారా భవిష్యత్తు అందకారం అవుతుందని చెప్పారు. అనంతరం అందరూ కలసి గ్రామం లో ర్యాలీ లో పాల్గొన్నారు. మత్తు పదార్థాలు వద్దు – మంచి కుటుంబం ముద్దు, డ్రగ్స్ వద్దు బ్రో అంటూ నినాదాలు చెప్పారు. కార్యక్రమం లో కార్యక్రమ అధికారి డాక్టర్ జె వి సుధీర్ కుమార్ మరియు ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు నరేష్, మస్తాన్, నందిని, ఐశ్వర్య, సుబ్బాయమ్మ మరియు 50 మంది వాలెంటర్లు పాల్గొన్నారు.

## ఈ నెల 15 న రామచంద్రపురంలో ఉద్యోగ మేళా

● జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్



**రామచంద్రపురం,నవంబర్ 11 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీ ఎస్ ఎస్ డి సి), జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాఆఫ్,సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15 న రామచంద్రపురం ఉపాధి భవన్ లో ఉద్యోగమేళా నిర్వహించనున్నారు. ఉద్యోగ మేళా వివరాల వాల్ పోస్టర్ను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మంగళవారం స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వాసంశెట్టి సత్యం తెలిపారు. ఇంటర్వ్యూలకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, ఫార్మసీ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ జాబ్ మేళాలో మొత్తం 10 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని నిరుద్యోగులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం 99484 04165, 99888 53335 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



నంద్యాల, నూనెపల్లి లో నిర్మాణం అవుతున్న శ్రీ శ్రీ శ్రీ సుంకుల పరమేశ్వరి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాల కోసం లక్ష 116 రూపాయల విరాళంను నిర్వాహకులకు అందజేస్తున్న నంద్యాల యాదవ ప్రముఖులు మరియు శ్రీశైలం లోని శ్రీ కృష్ణ అఖిల భారత యాదవ నిత్యా అన్నదాన సత్రం అధ్యక్షులు గొర్ల సత్యనారాయణ యాదవ్ దంపతులు మరియు వారి కుమారులు గొర్ల జయ కుమార్ యాదవ్, గొర్ల రామకృష్ణ యాదవ

**–నంద్యాల,నవంబర్ 11 (వార్తాప్రభ) :**

వార్తా ప్రభ
హైదరాబాద్

## ఘనంగా ప్యాక్స్ డైరెక్టర్ అరికల జీతయ్య ముదిరాజ్ జన్మదిన వేడుక

**శుభాకాంక్షలు తెలియజేసిన బిఆర్ఎస్ నాయకులు**



**దుండిగల్, నవంబర్ 11, (వార్తాప్రభ) :** దుండిగల్ మండల్ బోరంపేట్ 26వ వార్డు ప్రెసిడెంట్, బౌరంపేట్ ప్యాక్స్ డైరెక్టర్ అర్కల జీతయ్య ముదిరాజ్ పుట్టినరోజు సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ ని శంభీపూర్ లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మునిసిపల్ జనరల్ సెక్రటరీ కొల్తూర్ మల్లేష్ ముదిరాజ్, నాయకులు శ్రీశైలం యాదవ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనకు గళమెత్తిన జగద్గిరిగుట్ట వాసులు



**జగద్గిరిగుట్ట, నవంబర్ 11, (వార్తాప్రభ) :** గంజాయిలేని సమాజం కోసం జగద్గిరిగుట్ట కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో జగదీగుట్ట అన్ని బస్తిల కమిటీ, రాజకీయ పార్టీల నాయకులు హాజరై గంజాయి కి వ్యతిరేకంగా కలిసి పోరాటం చేద్దామని పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బస్తి కమిటీల నాయకులు ముక్తకంఠంతో జగద్గిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో గంజాయి నిర్మూలన కోసం కలిసి పనిచేద్దామని, జగద్గిరిగుట్టలో గంజాయి అమ్మలనుకునే వారికి, సేవించాలనుకునే వారికి జగద్గిరిగుట్టలో ఇల్లు కిరాయిలకు ఇవ్వద్దని, ఒకసారి గంజాయి కేసులో పట్టుబడితే జగద్గిరిగుట్ట నుండి బహిష్కరించాలని, అన్ని బస్తీలలో గంజాయి వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేసి బస్తీ ప్రజలను చైతన్యవంతం చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. అదేవిధంగా అన్ని రాజకీయ పార్టీలు బస్తీ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా జగద్గిరిగుట్టలో మానవహారాన్ని వేలాది మందితో ఏర్పాటు చేయాలని ఇది ఆరంభం మాత్రమేనని రానున్న రోజుల్లో గంజాయి రహిత సమాజం నిర్మించడం కోసం ప్రజలంతా ఏకం కావాలని గంజాయి వ్యతిరేక కమిటీ నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశంలో నాయకులను ప్రవీణ్ ఆహ్వానించగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అధ్యక్షతన సీనియర్ నాయకుడు యేసు రత్నంమండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు గణేష్, యువజన నాయకులు సాయి పంతుల, పవన్ రెడ్డి, జనసేన సతీష్, బిజెపిహనుమంతు చారి, రాజు యాదవ్, ప్రజానాట్యమండలి బాబు,ఏఐటీయూసీ శ్రీనివాస్, దుర్గయ్య, సదానంద, శ్రీనివాస్ నగర్ ఖయ్యూం,సీనియర్ జర్నలిస్ట్ తొండ వెంకట్, లెనిన్ నగర్ సదానందం, వనం రాజు, జీవి శ్రీనివాస్,రవీందర్ గౌడ్, మైసమ్మ నగర్ బసప్ప, రవి, రవీందర్ రెడ్డి బ్రహ్మానంద చారి,కృష్ణ గుడ్ మార్నింగ్ మురళి, సూరారం కాలనీ అధ్యక్షుడు సందీప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ త్రివేణి, విశ్వబ్రాహ్మణ సంఘం మనోహర్ చారి, దిన బందు కాలనీ ప్రవీణ్, అంజయ్య నగర్ వెంకటేష్, హెల్పింగ్ హాట్స్ హెల్పింగ్ హార్ట్స్ విజయ్, రాజు ఇమామ్ నరసింహ సామిల్ నరసింహారెడ్డి శ్రీనివాస్ సుంకిరెడ్డి అన్ని బస్తీల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రోడ్డు ను కబ్జా చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకుని మూసిన రోడ్డును తెరిపించండి.

**డిప్యూటీ కమిషనర్ కు విజ్ఞప్తి**



**శేరిలింగంపల్లి,నవంబర్ 11 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు రోడ్డు ను కబ్జా చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకొని మూసి వేసిన రోడ్డు ను తెరవాలనీ హైడ్రా అధికారులకు మియాపూర్,మక్త మహబూబ్ పేట్ గ్రామవాసులు ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామవాసులు మాట్లాడుతూ మక్తమహబూబ్ పేట్ గ్రామం,రెడ్డి కాలని,బీకే ఎన్ క్లైవ్,జేపీ నగర్, హెచ్.ఎం.టి స్వర్ణ పూరి తదితర కాలనీలనుండి దీప్తిశ్రీ నగర్,లింగంపల్లి, చందానగర్ వైపు వెళ్లాడనికి గత వంద సంవత్సరాలకు పూర్వం నుండి మట్టి రోడ్డు ఉండేది,జనాభా పెరిగేకొద్దీ ప్రభుత్వం కాలక్రమేనా దీనీపై బీటీ రోడ్డు వేశారు.ప్రజావసరాలను దృష్టి లో ఉంచుకొని రోడ్డును వేస్తే ఓ వ్యక్తి మద్యలోకి వచ్చి మక్త ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డు ను ఆక్రమించి ఈ స్థలం తనదే అంటూ రోడ్డు కు అడ్డంగా రేకులు పాతి రోడ్డు ను మూసివేశాడు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తుంటే ఉన్న రోడ్డు ను మూసి వేస్తే అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థం కావడం లేదు.ఒక వేళ అతనిది పట్టా భూమి అయితే ఆయన కు ప్రత్యామ్నాయ%శీ% చూపి రోడ్డును పునరుద్ధరించాలని చుట్టుపక్కల కాలనీల వాళ్ళ తరుపున గ్రామ సంక్షేమ సంఘం సబ్యుల%శీ% డిమాండ్ చేస్తున్నాము.ఈ విషయం పై పలు మార్లు అధికారులకు పిర్యాదులు చేసినా పట్టించుకోవడమే కాక కబ్జా దారుడికే వంత పాడుతున్నారు, ఇప్పటికైనా రోడ్డు ను పునరుద్ధరణ చేయకపోతే జి హెచ్ ఎం సి ప్రధాన కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరిస్తున్నా మని పేర్కొన్నారు.

## ప్రభుత్వ నిషేదిత గంజాయి వంటి మత్తు పదార్ధాలను రవాణా చేసే వ్యక్తుల సమాచారం అందించండి - జిల్లా ఎస్పీ రోహిత్ రాజు





**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్,చైతన్యం-డ్రగ్స్ పై యుద్ధం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన పోలీసులు నవంబర్ 15వ తేదీ వరకు జిల్లా పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్యం-డ్రగ్స్ పై యుద్ధం కార్యక్రమాలలో భాగంగా మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో సుజాతనగర్ సెంటర్ నుండి లక్ష్మీదేవిపల్లి,ఇల్లందు క్రాస్ రోడ్డు వరకు భారీ బైకు ర్యాలీకి జండా ఊపిన ఎస్పి ఈ ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చైతన్యం అనే కార్యక్రమం ద్వారా నిషేదిత గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన యువత పడకుండా,వారికి అవగాహన కల్పించడం,గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం నిరంతర తనిఖీలు చేపట్టడం వంటి కార్యక్రమాలను జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసులు చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి ప్రజలు సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు.గంజాయి అక్రమ రవాణా చేసే వారి సమాచారం అందించి భాద్యత గల పౌరులుగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరారు.మత్తుకు బానిసలై యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని అన్నారు.ఎవరైనా నిషేదిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ గానీ,విక్రయిస్తూ గానీ పట్టుబడితే అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని,అవసరమైతే పీడియాక్టులను కూడా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.. వెయ్యి మందికి పైగా ఈ ర్యాలీలో స్థానికులు,ప్రముఖులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్,కొత్తగూడెం 2టౌన్ సీఐ ప్రతాప్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు,1టౌన్ సీఐ కరుణాకర్,లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి,సుజాతనగర్ ఎస్సై రమాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

## విధుల్లో క్రమ-శిక్షణ పాటించాలి!!

- వ్యక్తిగత భద్రతా ప్రమాణాలు పాటించాలి
- సమస్యలను అధికారులకు తెలియజేయాలి
- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా





**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)** పోలీసు సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటించాలి అని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఈ మేరకు మంగళవారం కమీషనరేట్ కమ్యూనిటీ హాల్లో క్రమశిక్షణ వ్యక్తిగత భద్రతా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపి పోలీస్ సిబ్బందికి పలు సూచనలను చేశారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, నైతికతపై శిక్షణతో పాటు, ఆయుధాల వినియోగం, ట్రాఫిక్ నియమ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అలాగే, శారీరక దృఢత్వం కోసం యోగా, వ్యాయామం వంటివి కూడా ఇందులో భాగం అని అన్నారు. కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి వారికి న్యాయం జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. డయల్ 100 ఫోన్ రాగానే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.

## ఒత్తిడిని అధిగమించడమే తొలి విజయం!!

- పని భారం కాదు.. బాధ్యత.. కంపెనీ మనుగడ
- సానుకూల ఆలోచన సమస్యలన్నింటికీ పరిష్కార మార్గం
- ఉద్యోగుల శ్రేయస్సు, వృద్ధికై 2రోజుల వర్క్ షాప్
- ఎన్టీపిసి ఈడి చందన్ కుమార్ సమంత





**పెద్దపల్లి/ ఎన్టీపిసి: నవంబర్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)** పని వేళల్లో, విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించడమే తొలి విజయం అని ఎన్టీపిసి ఈడి చందన్ కుమార్ సమంత అన్నారు. ఈ మేరకు సోమ, మంగళవారాలు ఎన్టీపీసీ ఉద్యోగుల శ్రేయస్సు, సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఒత్తిడిని అధిగమించడం సానుకూల ఆలోచన విధానాన్ని పెంపొందించుకోవడం పైన రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈడి చందన్ కుమార్ సమంత ఉద్యోగులకు పలు సూచనలను చేశారు. పని భారం కాదు.. బాధ్యత.. కంపెనీ మనుగడ అని తెలిపారు. సానుకూల ఆలోచన సమస్యలన్నింటికీ పరిష్కార మార్గం అని అన్నారు. బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ బికే ఉమారాణి, బికే రజిని, బికే శోభ ఉద్యోగులకు పలు విషయాలను క్లుప్తంగా వివరించారు. సమస్యను గందరగోళంగా పెద్దగా చూడకుండా, అన్ని కోణాల నుండి విశ్లేషించడం ద్వారా పరిష్కారం కనుగొనడం సులభమవుతుంది అని తెలిపారు.

## ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు!!

- గోదావరిఖని ఆసుపత్రి, బస్టాండులో తనిఖీలు
- బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ లతో విస్తృత చెకింగ్





**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)** ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమయింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం రోజు గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి, బస్ స్టేషన్‌లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ లతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల లగేజ్‌తో పాటు పార్సల్ కార్యాలయంలో సోదాలు చేపట్టారు. ఆసుపత్రిలో పార్కింగ్ చేసిన వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ....పై అధికారుల ఆదేశాల మేరకు అప్రమత్తమై తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు

## దేశ విద్యారంగ అభివృద్ధికి పునాది వేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ను ఆదర్శంగా తీసుకోవాలి

**మహబూబ్ నగర్, నవంబర్ 11 (వార్తాప్రభ ప్రతినిధి):** భారత స్వాతంత్ర సమరయోధుడు,బహు భాషా కోవిదుడు,దేశ విద్యారంగ అభివృద్ధికి పునాది వేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ,దేశ అభివృద్ధికి అంకిత భావంతో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పిలుపునిచ్చారు.భారత దేశ మొదటి విద్యా శాఖ మంత్రి, మైనార్టీల అభివృద్ధికి ఎంతో కృషిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు .ఈ సందర్భంగా కలెక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, ఆయన సమయంలోనే యు.జి.సి, ఐఐటి వంటి అత్యున్నత విద్యా సంస్థలను స్థాపించడం జరిగిందని తెలిపారు.

## త్వరలో అందుబాటులోకి షాపింగ్ కాంప్లెక్స్!!

**సహకరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులకు కృతజ్ఞతలు**
**మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్**



**పెద్దపల్లి/ రామగుండం: నవంబర్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని రామగుండం రైల్వే స్టేషన్ ప్రాంతంలో నిర్మితమవుతున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులు చివరి దశలో ఉన్నట్లు అతి త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను నాయకులు సతీష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణానికి సహకరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అన్నిటికన్నా బాధ్యతాయుతమైనది.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఓటింగ్ సరళి పరిశీలించిన కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి .**



**శేరిలింగంపల్లి,నవంబర్ 11 (వార్తాప్రభ):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా మంగళవారం షేక్‌పేట్ డివిజన్ పరిధిలోని పోలింగ్ బూత్ నంబర్ 12, 14, 16, 17, 18,23 కేంద్రాలను గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.ప్రతి బూత్ వద్ద పోలింగ్ శాంతియుతంగా జరుగుతున్న విధానాన్ని ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో ముఖ్యమని,ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించడం ద్వారా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవచ్చని తెలిపారు.ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పోలింగ్ శాతం మందకొడిగా కొనసాగినప్పటికీ, ప్రజలు పెద్ద ఎత్తున బయటకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజలు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా,నిష్పాక్షికంగా ఓటు వేయాలని,ఇది ప్రజాస్వామ్య బలాన్ని పెంచుతుందని అన్నారు.పోలింగ్ కేంద్రాలలో వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలను,పరిశీలించి అధికారులతో మాట్లాడారు.ప్రజల సౌకర్యార్థం అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.భారత రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కు ప్రతి పౌరుడి చిహ్నమని,18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించాలని గంగాధర్ రెడ్డి పిలుపునిచ్చారు.మొత్తానికి ప్రజాస్వామ్య పండుగగా భావించే ఈ ఎన్నికల్లో అందరూ చురుకుగా పాల్గొని అధిక శాతంలో పోలింగ్ నమోదు చేయాలని ఆయన ఆకాంక్షించారు.

## లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కెకెఎం ట్రస్ట్ చైర్మన్



**కుత్బుల్లాపూర్, నవంబర్ 11, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ లో కెకెఎం ట్రస్ట్ చైర్మన్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన కొండా సుజాత, ఎరగాంధండ్ల వంశీ, రెడ్డి సత్యనారాయణ, నీరుడు ఓంప్రకాష్, మర్గం శంకర్, కొట్టె సులోచన గతంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిఎం సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంగళవారం తన నివాసం వద్ద మూడు లక్షల రూపాయల సిఎంఆర్ఆఫ్ చెక్కులు పంపిణి చేశారు..ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అలాగే మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక కృషితో నియోజకవర్గంలో ప్రజాపాలన ద్వారా బడుగు,బలహీన వర్గాలకు అండగా నిలుస్తుంన్నారని కొనియాడారు. ప్రజాపాలనలో పేద,మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా కార్పొరేట్ రంగంలో వైద్యం అందించడంతో పాటు వైద్యనికి అయినా ఖర్చులు సిఎంఆర్ఆఫ్ ద్వారా పేదలకు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దూలపల్లి మాజీ కౌన్సిలర్ బైరి శివకుమార్ గౌడ్, చౌడ శ్రీనివాస్, నాగిళ్ల శ్రీనివాస్, బాలప్ప, యాం సాగర్, ఉలిపి శ్యామ్, అరుణ్ కుమార్, రఘు గౌడ్, సంపత్, కృష్ణ, కృష్ణమ నాయుడు, కృష్ణారెడ్డి, మరియు లబ్దిదారులు, నియోజకవర్గం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## బీహార్ తొలి దెబ్బ సిద్ధూ మీదనేనా ?

బీహార్ లో రెండో విడత చివరి విడత ఎన్నికలు మంగళవారంతో పూర్తి అయిపోతున్నాయి. ఇక రెండు రోజుల తరువాత కౌంటింగ్ ఉంది. ఈ నెల 14న ఫలితాలు వస్తాయి. బీహార్ లో ఎవరి గెలిచేది జనాలు తీర్పు ఇస్తారు. ఈసారి ఫలితం అయితే మఃఎందిచీశీఅవగ బంధన్ కి అనుకూలంగా ఉంటుందని ఇండియా కూటమి నేతలు చాలా నమ్మకంగా ఉన్నారు. ఈసారి ఘట్ బంధన్ గెలిచి బీహార్ కైవశం అయితే మాత్రం కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ క్రెడిట్ లో సింహ భాగం అందుకుంటారు అని అంటున్నారు. ఆయన బీహార్ ఎన్నికల కంటే ముందే నిర్వహించిన ఓటర్ చోరీ యాత్రకు బ్రహ్మాండమైన స్పందన లభించింది. ఒక విధంగా జనాల మూడ్ ని ముందే మార్చేసినట్లుగా కూడా చెబుతున్నారు. ఇండియా కూటమి కట్టాక వరస పరాజయాలే పలకరించాయి. కేంద్రంలో 2024 ఎన్నికల్లో కచ్చితంగా అధికారంలోకి వస్తామని వేసుకున్న అంచనాలు తప్పాయి. మూడోసారి కూడా మోడీ ప్రధానిగా ప్రమాణం చేసి హ్యాట్రిక్ పీఎం అనిపించుకున్నారు. ఇక హర్యానా మహారాష్ట్రలలో కూడా పెట్టుకున్న ఆశలు నిరాశ అయ్యాయి. అక్కడా ఎన్డీయేదే పై చేయి అయింది. ఢిల్లీలో చూసుకుంటే రెండున్నర దశాబ్దాల తరువాత బీజేపీ గెలిచి జెండా ఎగరేసింది. బీహార్ బూస్ట్ సరే ఇన్ని రకాలుగా ఇబ్బంది పడుతున్నా ఇండియా కూటమి కొడితే ఏనుగు కుంభస్థలం కొట్టాలని నిర్ణయించుకుని మరీ బీహార్ బరిలోకి దిగింది. బీహార్ లో కనుక అధికారం దక్కితే మెల్లగా హిందీ బెల్ట్ ని పాకేందుకు ఆస్కారం ఉంటుందని దేశంలో అత్యధికం ఎంపీ సీట్లు ఉన్న ఉత్తరాదిన మార్పు కచ్చితంగా వస్తుందని అది 2029 ఎన్నికల్లో బాగా దోహదపడుతుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. అంతే కాదు బీహార్ ఇచ్చిన బూస్ట్ తో ఇండియా కూటమి మరింత శక్తివంతంగా మారి ఎన్డీయే మీద ఢీ కొట్టేందుకు ఇంకా కొత్త ఉత్సాహం చూపిస్తుంది అని అంటున్నారు. కాంగ్రెస్ అగ్ర నేతగా ఉన్న రాహుల్ గాంధీ పార్టీలో కీలక నిర్ణయాల విషయంలో ఇంతకాలం ఆచీ తూచీ వ్యవహరిస్తూ వచ్చారు. కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉన్నా వాయిదా వేస్తూ వచ్చారు. దానికి కారణం దేశంలో ప్రజల మూడ్ నాడి అందిపుచ్చుకుని తమకు సానుకూలం చేసుకునేందుకే ఈ ప్రయత్నం అని అంటున్నారు. ఇపుడు బీహార్ కనుక ఇండియా కూటమికి దక్కితే కాంగ్రెస్ సంస్థాగతంగా కూడా మరింత బలంగా మారి సంచలన నిర్ణాయలు తీసుకునే చాన్స్ ఉంది అని అంటున్నారు. రాహుల్ సైతం ఎటువటి తడబాటూ తాత్సారం లేకుండా ముఖ్యమైన నిర్ణయాలనే తీసుకుంటారు అని అంటున్నారు. ఇక లేటెస్ట్ గా చూస్తే కన్నడ కాంగ్రెస్ సీఎం సిద్ధరామయ్యకు కేంద్ర కాంగ్రెస్ పెద్దల అపాయింట్మెంట్ లభించలేదు అని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. నిజానికి చూస్తే కనుక కేంద్ర కాంగ్రెస్ పెద్దలతో సమావేశం కావాలని సిద్ధరామయ్య భావించారు, కానీ ఆ సమావేశం అవసరం లేదని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని అంటున్నారు. దాంతో కర్ణాటక సీఎం పీఠం కదులుతోందని వార్తలు జోరుగా షికారు చేస్తున్నాయి. మాట ప్రకారం : ఇక చూస్తే రెండున్నరేళ్ళ తర్వాత సిద్ధరామయ్య దిగిపోయి డీకే శివకుమార్ కి బాధ్యతలు అప్పగిస్తారు అని చాలా కాలంగా ప్రచారం ఉంది. ఆ గడువు ఈ నెలాఖరుతో ముగుస్తోంది. దాంతో డీకేకి కన్నడ పగ్గాలు అప్పగించడానికి కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించారా అందుకే సిద్ధరామయ్యకు అపాయింట్మెంట్ ఇవ్వలేదా అన్నది కూడా చర్చ సాగుతోంది. ఇక బీహార్ లో కనుక కాంగ్రెస్ కూటమి గెలిస్తే రాహుల్ గాంధీకి కాంగ్రెస్ కి కూడా మంచి బలం వస్తుందని దాంతో సంస్థాగతంగా కీలక నిర్ణయాలు మరింత దూకుడుగా తీసుకునే చాన్స్ ఉందని అంటున్నారు. అలా చూసుకుంటే బీహార్ తొలి దెబ్బ కన్నడ సిద్ధూకే తగులుతుందా అన్నది ఇపుడు పొలిటికల్ గా హాట్ టాపిక్ గా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 11 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీం పట్నం గాజులపేట సహాయమాత స్కూల్ సమీపంలో వరి పొలాలలో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. వీరయ్య అనే వ్యక్తి వరి పొలం కి మందు కొడుతుండగా మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారాన్ని అందించాడు. మృతుడికి సుమారు 35 నుండి 45 సంవత్సరాల వయసు ఉండవచ్చు. మగ వ్యక్తి చనిపోయి శరీరమంతా కుళ్ళిపోయి ఎముకలు,పురేగా మారడంతో గుర్తించడం కష్టంగా మారింది. మృతదేహాన్ని పోస్టింగ్ మార్టం నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దైవ నామము శ్రేష్టము




భగవంతుని నామము
పరమ పుణ్య ధామము
శరణన్న వారికది
ఇల ఆశ్రయ దుర్గము
బ్రతుకుల్లో చీకటిని
పారద్రోలు దీపము
పనికిరాని వాటిని
పోగొట్టు ఆయుధము
ఆ నామము ధ్యానము
చేయాలి దినదినము
శుద్ధి చేసుకోవాలి
మలినమైన హృదయము
శక్తి ఉన్న నామము
భక్తులకది ప్రాణము

శ్రద్ధగా స్మరిస్తే
వృద్ధికి సోపానము
రక్షణ కవచమది
అశుభములు తరమునది
బ్రతుకులు మార్చునది
సుగుణములు ఇచ్చునది
ఆ నామము శ్రేష్టము
కలుగజేయు క్షేమము
ఖరీదైన హేమము
ప్రసాదించు మోక్షము

**-గద్వాల సోమన్న,**

గణితోపాధ్యాయుడు సెల్:9966 414580

# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం

- మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న
- పశ్చిమ నియోజకవర్గ బూత్ కన్వీనర్ల, క్లస్టర్,యూనిట్ ఇన్చార్జుల ప్రమాణ స్వీకారం
- భారీ ఎత్తున నగరాల కళ్యాణ మండపంలో కార్యక్రమం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా







**విజయవాడ పశ్చిమ నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ గల తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఆమోదించబడిన బూత్ కన్వీనర్ల, క్లస్టర్,యూనిట్ ఇన్చార్జుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం పశ్చిమ నియోజకవర్గంలో చిట్టినగర్ నగరాల కళ్యాణ మండపంలో మంగళవారం పెద్ద ఎత్తున జరిగింది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న సభాధ్యక్షత వహించగా, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బూత్ కన్వీనర్ల, క్లస్టర్,యూనిట్ ఇన్చార్జులతో బుద్దా వెంకన్న ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలందరీ అభిప్రాయం సేకరించిన తర్వాతే బూత్ కన్వీనర్ల, క్లస్టర్,యూనిట్ ఇన్చార్జులుగా నియమించటం జరిగిందన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన నాయకులందరికీ అభినందనలు తెలియజేటంతోపాటు, పార్టీ కోసం కష్టపడి పని చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నిర్ణయాలు, అభిప్రాయాలతోనే బలపడుతుందన్నారు. కార్యకర్తల ఆధ్వర్యంలోనే పార్టీ ముందుకు నడుస్తుందని స్పష్టం చేవారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు అందరం కలిసికట్టుగా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూర్ బాషాదూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో టిడిపి అధికారంలో వున్నా, లేకపోయినా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పార్టీ కోసం పనిచేశారని కొనియాడారు. పశ్చిమ నియోజకవర్గం టిడిపికి కంచుకోట లాంటిదన్నారు. ఎంపీ గా కేశినేని శివనాథ్ గెలిచిన తర్వాత ఈ ఒకటిన్నర సంవత్సరాల్లో చాలా వరకు పార్టీని ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు కార్యకర్తలు చాలా బాగా కృషి చేశారంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చిట్టాబత్తుని శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సొలంకి రాజు, టిడిపి దళిత సీనియర్ నాయకులు కామ దేవరాజు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి కొట్టేటి హనుమంతురావు, కార్పొరేటర్ ఉమ్మడి చంటి,నగరాల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సుఖాసి కిరణ్ , పశ్చిమ నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు నమ్మిభాను ప్రకాష్, గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాల మాధవ , పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, లతో పాటు క్లస్టర్ ,యూనిట్ , బూత్ కమిటీల సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అనుమానాస్పదంగా ఉండే వ్యక్తుల్ని గమనించాలి

- దుర్గా ఘాట్ లో యాత్రికులను ఆ ప్రాంతంలో అప్రమత్తం చేయాలి
- కనకదుర్గ నగర్ లో లగేజ్ క్లోక్ రూములో భద్రపరిచే చర్యలు చేపట్టాలి
- సెల్ ఫోన్లు, ఆలయానికి వచ్చే భక్తులను తనిఖీ చేయాలి
- సెక్యూరిటీ సిబ్బందికి పలు ఆదేశాలు ఇచ్చిన దుర్గగుడి ఈవో శీనా నాయక్



**విజయవాడ పశ్చిమ నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అనుమానాస్పదంగా ఉండే వ్యక్తులు పట్ల అప్రమత్తంగా ఉండాలి వెంటనే వారిని ప్రశ్నించి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలి. ఇంద్రకీలాద్రి కొండపై వేంచేసిన అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు తమ లగేజ్ ని భద్రపరచుకునేందుకు వీలుగా కొండ కింద దుర్గా ఘాట్, కనకదుర్గ నగర్ లో ఏర్పాటుచేసిన క్లోక్ రూంలో భక్తులకు సంబంధించిన లగేజ్ భద్రపరుచుకునే విధంగా చర్యలు చేపట్టాలి. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులను తనిఖీలు చేయాలి ఆలయంలోకి సెల్ ఫోన్లు ప్రవేశించకుండా పకడ్బందీగా భద్రతాపరమైన చర్యలు చేపట్టాలని దుర్గ గుడి ఈవో శీనా నాయక్ ఆలయ సెక్యూరిటీ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఇంద్రకలాద్రిపై వేంచేసిన అమ్మవారి ఆలయంలో మంగళవారం మహా మండపం ప్రాంగణంలో ఆలయ సెక్యూరిటీ సిబ్బందికి పలు కీలకమైన సూచనలు చేయడం జరిగింది. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులందరినీ తనిఖీలు చేయాలని భద్రతాపరమైన చర్యల్లో భాగంగా సెల్ ఫోన్లు, లగేజీ ఇతర వస్తువులు ఆలయంలోకి ప్రవేశించకుండా వాటిని నిరోధించి కొండ కింద ఉన్న కనకదుర్గ నగర్, దుర్గా ఘాట్ ప్రాంతంలో క్లోక్ రూముల వద్ద వాటిని భద్రపరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వ్యక్తులు అనుమానస్పదంగా లేక వారి వ్యవహార శైలి పై అనుమానం వస్తే వెంటనే వారిని స్థానిక అవుట్ పోస్ట్ పోలీసు వారికి అప్పగించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆలయ అధికారులు ఏ ఈ ఓ ఎన్ రమేష్ సెక్యూరిటీ అధికారులు సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లు కు సరదాగా మద్యం సేవిస్తున్నా క్షణం క్షణం పోలీసులే గుర్తుకు రావాలి

***మన విధులు వారిపట్ల అంత కఠినంగా ఉండాలి***
***విజయవాడ నగర ఏ డి సి పి గుణ్ణం రామకృష్ణ***







**విజయవాడ పశ్చిమ నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరంలో రౌడీ షీటర్లు సరదాగా మద్యం సేవిస్తున్నా పోలీసులే గుర్తుకు వచ్చేంత గా రౌడీ షీటర్లు పట్ల మన విధులు అంత కఠినంగా ఉండాలని (ఏ డి సి పి ) అదనపు డిప్యూటీ పోలీసు కమిషనర్ గుణ్ణం రామకృష్ణ కొత్తపేట పోలీసులతో అన్నారు. సోమవారం రాత్రి వెస్ట్ డివిజన్ పరిధిలోని కొత్తపేట పోలీస్ స్టేషన్లో క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు.. స్టేషన్లో పెండింగ్ లో ఉన్న కేసులు గురించి ఎస్ఐలకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో శాంతిభద్రతల పర్యవేక్షణ పట్ల మనవంతు భరోసా ఇవ్వవలసిన భాద్యతలు మనం మర్చిపోరాదని రౌడీ షీటర్లు సరదాగా మద్యం సేవించాలన్నా మనమే గుర్తుకు రావాలని సూచించారు. ప్రతి ఎస్ ఐ ని పేరు పేరునా పిలిచి అతని సెక్టార్ పరిధిలోని రౌడీ షీటర్లు దిన చర్యలు అడిగారు. రౌడీ షీటర్లు పూర్తి స్థాయిలో వివరాలు అంటే...... అతని కుటుంబం నేపథ్యం అతని సెల్ నెంబర్, ఇంటి నెంబర్, అతనిపై ఉన్న కేసులెన్ని... ఆ రౌడీ షీటర్ ప్రస్తుతం జైల్లోనే ఉన్నాడా....బెయిలు మంజూరైయ్యి బయట తురుగుతున్నాడా...ఇత్యాది వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఒక విధంగా హెూమ్ వర్క్ చేయని విద్యార్థిలు ఎలా భయపడుతూ చేతులు కట్టుకొని నిలబడతారో అదే సీను కొత్తపేట పోలీసు స్టేషన్ సిబ్బంది లో సంతరించుకుంది. సోమవారం రాత్రి సుమారు గంటన్నర సమయం పాటుగా స్టేషన్ సిబ్బందిని అందరినీ ఉద్దేశించి మాట్లాడారు, వారిని స్టేషన్ పరిధిలో జరిగే కేసులు గురించి, రాత్రి , పగలు గస్తీలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు..వారికున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ డి సి పి తో పాటుగా కొత్తపేట సి ఐ ఎస్ చిన కొండలరావు ,ఎస్ ఐ లు, ఏ ఎస్ ఐ లు సిబ్బంది, హెూంగార్డ్స్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ కి ఘన నివాళులు



**విజయవాడ పశ్చిమ నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్వాతంత్ర్య సమరయోధుడు,భారతదేశ మొదటి విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని, మౌలానా ఆజాద్ ఉర్దూ హై స్కూల్ నందు జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 53 వ డివిజన్ కార్పొరేటర్ మహదేవు అప్పాజీ రావు హై స్కూల్ విద్యార్థులకు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులందరికీ అరటి పళ్ళు పంపిణీ చేశారు. అదే సందర్భంలో జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకొని ఉపాధ్యాయులందరిని ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పెద్దలు పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి గొప్పతనాన్ని, వారు దేశానికి అందించిన సేవలను వివరించడంతోపాటు విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. ఈ సందర్భంగా 53 వార్డు కార్పొరేటర్ మహదేవు అప్పాజీరావు మాట్లాడుతూ కుటుంబంలో ఉన్న పేదరికం పారద్రోలే సరైన ఆయుధం విద్య మాత్రమే అని విద్యార్థులను సందేశం అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, శ్రీమతి కే కళ్యాణి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ చదువుకోవాలని, పాఠశాలకు,కుటుంబానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు విద్యార్థులను భావి భారత పౌరులుగా ఎదగమని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి కే కళ్యాణి , పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు అబ్దుల్ కుదూస్ ఖాన్, ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు రామ కృష్ణ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



## భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం జయంతి వేడుకల సందర్భంగా కార్పొరేషన్ లో ఘన నివాళులు





**విజయవాడ పశ్చిమ నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద మౌలానా ఆజాద్ జన్మదిన వేడుకలను విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఇన్చార్జి కమిషనర్ ఏ.రవీంద్రరావు ఘనంగా నిర్వహించారు. ముందుగా మౌలానా ఆజాద్ గారి చిత్రపటానికి పూలమాలలు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సంస్కరణలతో దేశ విద్యా వ్యవస్థకు పునాదులు వేశారన్నారు. దేశ స్వతంత్రం కోసం పోరాడిన యోధుడని, దేశానికి స్వతంత్రం వచ్చిన తరువాత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ పని చేశారని గుర్తు చేశారు. విద్య, శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. ప్రజలందరికీ జాతీయ విద్యా దినోత్సవ, మైనారిటీ సంక్షేమ దినోత్సవ శు భాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కమిషనర్ ఏ. రవీంద్రరావు భారతరత్న అబుల్ కలాం ఆజాద్ గురించి మాట్లాడుతూ 1912లో అల్-హిలాల్ పత్రిక ప్రారంభించి, బ్రిటిష్ వలస పాలనను తీవ్రంగా విమర్శించారన్నారు. ఖిలాఫత్ ఉద్యమం, అసహకార ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని 1923లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన అతి యువ నాయకుడన్నారు. భారత మొదటి విద్యామంత్రిగా ఐఐటీలు, యూజీసీ, సాహిత్య లలితకళా సంగీత నాటక అకాడమీలు స్థాపించారన్నారు. హిందూ-ముస్లిం ఐక్యత, లౌకిక విద్యా విధానానికి బలమైన పునాది వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి చీఫ్ ఇంజనీర్ పి.సత్య కుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి. వెంకటనారాయణ, మేనేజర్ ప్రభావతి, విఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతి లేనిదే భవనం నిర్మించరాదు

***నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ కే సంజయ్ రత్న కుమార్***





**విజయవాడ పశ్చిమ నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అనుమతి లేనిదే భవనం నిర్మించరాదని విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్న కుమార్ అన్నారు. మంగళవారం ఉదయం చీఫ్ సిటీ ప్లానర్ ఆదేశాల మేరకు, కార్పొరేషన్ పరిధిలోని ఉన్న అనధికార నిర్మాణాలపై చర్యలు చేపట్టడం జరుగుతున్నది, ఈ ప్రక్రియలో గురునానక్ కాలనీ, రామలింగేశ్వర నగర్, హిందూ హైస్కూల్ ప్రక్కన, కొత్తపేట, కేటి రోడ్ లో ఉన్న అనధికార కట్టడాలను గుర్తించి తొలగింపు చర్యలు తీసుకున్నారని అన్నారు. ఈ సందర్భంలో చీఫ్ సిటీ ప్లానర్ మాట్లాడుతూ విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏవైనా అనధికార నిర్మాణాలు లేదా భవన మార్పులు అనుమతులు లేకుండా చేపడితే, వాటిపై తక్షణ చర్యలు తీసుకోబడతాయని, వి ఎమ్ సి టౌన్ ప్లానింగ్ బృందం నిరంతర పరిశీలన చేపట్టి, అనధికార నిర్మాణాలను గుర్తించి తొలగించే కార్యక్రమం కొనసాగిస్తోందిని, కావున నగర ప్రజలు తమ నిర్మాణాలు అనుమతులతోనే చేపట్టవలెనని, లేనిపక్షంలో విధినిర్వహణ చర్యలు తప్పవని తెలిపారు.

## ఎమ్మెల్యే సుజనా చౌదరి సహకారంతో ఎల్ ఓ సి అందజేత



**విజయవాడ పశ్చిమ నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సహకారం తో మంజూరైన( లెటర్ అఫ్ క్రెడిట్) ఎల్ ఓసీ ను 42 వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్,కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నేతలతో కలిసిఎన్డీఏ కార్యాలయంలో అందజేశారు. 51 వ డివిజన్ , కొత్త పేటకు చెందిన గొన్న రామాయమ్మ హృద్రోగంతో బాధపడుతు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. తనకి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం సాయం కొరకు దరఖాస్తు చేశారు. మంజూరైన రూ 5 లక్షల 52 వేల ఎల్ ఓసీ ను బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు త్వరితగతిన ఎల్ ఓసీ ను మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారుఈ కార్యక్రమంలో కూటమి నేతలు అలీ, భావి శెట్టి శ్రీనివాస్, నల్లపురెడ్డి అప్పారావు, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు ..



# ప్రజల భద్రత , నిఘా కోసం సీ సీ కెమెరాల ఏర్పాటు..

## ఎమ్మెల్యే సుజనాకు కృతజ్ఞతలు తెలిపిన ఊర్మిళా నగర్ వాసులు..

**విజయవాడ పశ్చిమ నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**టీడీపీ డివిజన్ అధ్యక్షులు మోరబోయిన రాంబాబు ను అభినందించిన ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, భవానిపురం ఎస్ఐ సుమన్.. 43 వ డివిజన్ లో సీ సీ కెమెరాల ఏర్పాటు కు సహకరించిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు కృతజ్ఞతలు తెలుపుతూ కెమెరాలను ఇన్ స్టాల్ చేయడానికి అవసరమైన సామగ్రిని అందించిన టీడీపీ డివిజన్ అధ్యక్షుడు మొరబోయిన రాంబాబును అభినందిస్తున్నామని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఎస్ ఐ సుమన్ అన్నారు..ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో "సుజన ఫౌండేషన్" సహకారంతో సీ ఐ ఉమామహేశ్వరరావు సూచనల మేరకు 43 వ డివిజన్ లో సీ సీ కెమెరాలను ఏర్పాటు చేయదలిచారు.43 వ డివిజన్ ,ఏకలవ్య నగర్, ప్రజాశక్తి నగర్, సీతారెడ్డి బొమ్మా రెడ్డి నగర్ ,నులకపేట తదితర ప్రాంతాల్లో సీ సీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ఊర్మిళానగర్ పార్కు సెంటర్ నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, భవానిపురం ఎస్ఐ సుమన్ ముఖ్య అతిథులుగా పాల్గొని 14 సీసీ



కెమెరాలను వారి చేతుల మీదుగా అందించారు. సీ సీ కెమెరాలను ఇన్ స్టాల్ చేయడానికి అవసరమైన సామగ్రిని అందించిన టీడీపీ డివిజన్ అధ్యక్షుడు మొరబోయిన రాంబాబు ను వారు అభినందించారు.సీ సీ కెమెరాల ఏర్పాటు తో నేరాలను అదుపు చేయవచ్చని ఎవరికి వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ ఐ సుమన్, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్



సూచించారు. సీ సీ కెమెరాల ఏర్పాటు కు సహకరించిన ఎమ్మెల్యే సుజనా కు ఊర్మిళ నగర్ వాసులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కూటమి నేతలు గోళ్ళ విశ్వేశ్వరరావు, కూరాకుల రామచంద్ర రెడ్డి,గుమ్మ బాలు, కాకర్ల కోటి, మోరబోయిన శ్రీను, పెన్నా ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు...

## చేజర్ల మడపల్లిలో రైతులకు యూరియా పంపిణీ



**చేజర్ల నవంబర్ 11 (వార్తాప్రభ)** మండలంలోని చేజర్ల మడపల్లి రైతు సేవా కేంద్రం నందు మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో చేజర్ల మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ షేక్.సిరాజుద్దీన్ పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వచ్చే రబీ సీజన్లలకు సంబంధించిన యూరియా పుష్కలంగా అందుబాటులో ఉందని రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని చెప్పారు.ఒక ఎకరాకు మూడు బస్తాలు చొప్పున యూరియా రైతులకు అందించడం జరుగుతుందన్నారు.అందుకు సంబంధించి రైతులకు యూరియా కార్డు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో చేజర్ల మండల వ్యవసాయ శాఖ అధికారి పి. హిమబిందు ఏఈఓ సుజాత వీఎఏలు మేఘన వర్షిణి చెంచయ్య మరియు రైతులు పాల్గొన్నారు.

## గంబుషియా చేపల ద్వారా దోమల నిర్మూలన



**విజయవాడ పశ్చిమ నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గంబుషియా చేపల ద్వారా దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టారు విజయవాడ నగరపాలక సంస్థ వి. కామేశ్వరరావు. మంగళవారం ఉదయం కొత్త రాజరాజేశ్వరి పేటలో నివాస ప్రదేశాలలో మధ్య పేరుకుపోయిన నీటి నిల్వలలో గంబుషియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ కామేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో దోమల నిర్మూలనకు యాంటీ లార్వా ఆపరేషన్లు చేపడుతున్నారని, దోమలు పెరగకుండా ఉండేందుకు ఎంఎల్ ఆయిల్ ను కాలువల్లో స్ప్రే చేస్తున్నారని, ప్రతిరోజు ఫాగింగ్ చేపడుతున్నారని అన్నారు.ఈ పర్యటనలో మలేరియా శానిటరీ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ హయాంలో గత పాలనంతా కల్తీమయం అవినీతిమయం!

### నమ్మి భాను ప్రకాష్ యాదవ్




**విజయవాడ పశ్చిమ నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలుగుదేశం పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి భాను ప్రకాష్ యాదవ్ మరోసారి వైసీపీ గత పాలనపై ధ్వజమెత్తారు.చిట్టినగర్ లో వారి కార్యాలయంలో జరిగిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ! వైసిపి పార్టీ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో నోటికి వచ్చిన అమలు కాని హామీలు ఎన్నో ఇచ్చి ఒకే ఒక్క ఛాన్స్ అని ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత వారి ప్రభుత్వ కాలమంతా ధనార్జనే ధ్యేయంగా నడిచిందని మండిపడ్డారు. దోచుకోవడానికి దాచుకోవడానికి ఏది అనివార్యం కాదు అన్నట్టుగాగత ప్రభుత్వ కాలంలో పేద మధ్యతరగతి ప్రజలు వేలమంది మరణించడమే కాకుండా లక్షల మంది అనారోగ్యం పాలు కి కారణం అయినటువంటి కల్తీ మద్యం విషయమే కాకుండా హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొంది రోజుకి లక్షలాదిమంది దర్శించుకునే కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని కూడా మినహాయింపు లేకుండా వారి ధనార్జన కోసం లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి యదేచ్ఛగా వాడినట్టు సి.బి.ఐ భాగస్వామిగా ఉన్న సిట్ నిర్ధారణకు రావడంతో జగమెరిగిన సత్తమేమన్నారు. గత ప్రభుత్వ పాలనంత కల్తీమయం అవినీతిమయం అని ప్రజలందరికీ స్పష్టంగా అర్థం అవుతుందని అన్నారు.

# ఎంఎస్ఎంఈ పార్కులను వర్చువల్ గా శంకుస్థాపన.

**మచిలీపట్నం నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వ్యాపారవేత్తలుగా తయారు అయ్యేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని, యువతకు ఎన్నో మంచి అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకొని పైకి ఎదగాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉద్బోధించారు.మంగళవారం ఉదయం ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పెదఈర్లపాడు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని 17 జిల్లాలలో 50 ఎం ఎస్ ఎం ఈ పార్కులను వర్చువల్ గా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను చేసిన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో బాపులపాడు మండలం వేలేరు వీరవల్లి గ్రామంలో 40 ఎకరాల విస్తీర్ణంలో 12 కోట్ల రూపాయల వ్యయంతో నెలకొల్పనున్న శ్రీ వేద ఇన్నోవేషన్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్కు ముఖ్యమంత్రి వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం మండలం రుద్రవరం లోని కృష్ణ విశ్వవిద్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అకాడమిక్ బ్లాకులోని శ్రీ అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో కార్యక్రమం జరిగింది. తొలుత దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ , ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, తదితర ప్రముఖులు పూలమాలలువేసి పుష్పాలతో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే వ్యాపారవేత్త తత్వం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువు పూర్తయ్యాక ఉద్యోగం సంపాదించడమే కాకుండా ఒక మంచి ఆలోచనతో వ్యాపారవేత్త కూడా కావచ్చున్నారు. చిన్న వ్యాపారంతో మొదలుపెట్టి పెద్ద వ్యాపారం చేసి గొప్ప వ్యాపారవేత్తగా తయారు కావచ్చని ధీరుబాయ్ అంబానీ జీవిత చరిత్రను విశదీకరించి తెలిపారు. గతంలో వ్యాపారం చేయాలంటే చాలా కష్టంగా ఉండేదని అదే నేడు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించి ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. పరిశ్రమలు నెలకొల్పుట కోసం పిఎంఈజీపి కింద 40 శాతం రాయితీ, 60 శాతం బ్యాంకు రుణాలు అందిస్తోందన్నారు.పీఎంఎఫ్ఎంఈ, ముద్ర వంటి పలు పథకాల ద్వారా కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందచేస్తుందన్నారు.జిల్లాలో చిన్న చిన్న వ్యాపారస్తులను గుర్తించి వారికి సహకారం అందించి మరింత వ్యాపారం పెంపొందించుకునేందుకు ప్రణాళిక రూపొందించామని అందులో మొదట్లో 150 మందికి అనుకున్నప్పటికీ 300 మంది ఎంపిక అయ్యారని వారిలో ఇప్పటికే 70 మందికి రుణ సహాయం అందించే విధంగా అనుసంధానం చేశామన్నారు.నేటి యువత చెడు అలవాట్లకు బానిస కారాదని హితవు పలుకుతూ వారికి అవకాశాలు చాలా ఉన్నాయనీ వాటిని అందిపుచ్చుకొని పైకి ఎదగాలన్నారు. విజయం రాత్రికి రాత్రి దక్కదని కొంత ఓపికగా అంకితభావంతో సవాలుగా తీసుకొని కృషి చేస్తే తప్పకుండా విజయం దక్కుతుందన్నారు. ఆకాశమే హద్దుగా యువత ముందుకు వచ్చి యువ పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలన్నారు. వారి ద్వారా పదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. శ్రీ వేద ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఇది రాష్ట్రంలో నెలకొల్పుతున్న మొట్టమొదటి ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ అని అన్నారు. రాష్ట్ర ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ తాను కూడా చదువు కంటే వ్యాపారానికి ప్రాధాన్యతని ఇచ్చానని చెబుతూ స్వయం ఉపాధి



ద్వారా పరిశ్రమలు పెట్టి పదిమంది కి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం రుణాలు, స్థలాలు, విద్యుత్ తదితర సౌకర్యాలను కల్పించి సహకారం అందిస్తుందన్నారు.మచిలీపట్నానికి మహర్దశ ఉందని, ఓడరేవు ఆధారిత పరిశ్రమలు రాబోతున్నాయన్నారు.మనం తయారు చేసే ఉత్పత్తులను ఎగుమతులు చేసుకోవడానికి ఓడరేవు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున వస్తున్నారన్నారు. పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ మన రాష్ట్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆస్తి, స్ఫూర్తి, పెట్టుబడి అని కొనియాడారు. మొదటి దశలో పామర్రు నియోజకవర్గంలోని ఐనంపూడిలో ఎం ఎస్ ఎం ఈ పార్కు శంకుస్థాపన జరిగిందని వచ్చే 6 నెలల్లో పూర్తవుతుందన్నారు. తాను ఏదైనా మంచి చేయాలని ఆలోచించే లోపే జిల్లా కలెక్టర్ ముందుండి ఆ పని చేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. ప్రతి ఒక్కరు శ్రమించడంతోపాటు స్మార్ట్ గా పనిచేస్తే అనుకున్నది సాధ్యమవుతుందని, తిరిగే ఉండదని స్పష్టం చేశారు.ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ ఎవరైనా సరే పైకి రావాలంటే కోరిక, క్రమశిక్షణ, పట్టుదల ఉండాలన్నారు.తాను 5 వ తరగతి వరకు చదివి ఈ స్థాయికి వచ్చానంటే అందుకు మనం చేసే పనిలో అంకితభావం ఉండాలన్నారు. పనిచేసే సంస్థకు నమ్మకంగా ఉండాలన్నది చాలా ముఖ్యమన్నారు. సెల్ఫోన్లను అవసరం మేరకే వినియోగించాలని హితవు పలికారు.సిప్రా ల్యాబ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ వేద ఇన్నోవేషన్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత వి సత్యనారాయణ మాట్లాడుతూ అన్నింటికంటే చదువుకోవడం కష్టమని, ఒక ఆలోచనతో వ్యాపారం మొదలుపెట్టి సులభంగా చేయవచ్చున్నారు.ఎవరైనా యువకులు పారిశ్రామికవేత్తలుగా కావాలంటే తన ప్రోత్సాహం ఉంటుందని, వారి ఆలోచనలకు మెంటార్లను జోడించే ఏర్పాట్లను చేస్తామన్నారు.తన పరిశ్రమ ద్వారా 4,500 మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే రామ్ జి, డీఐసీ జీఎం ఆర్ వెంకటరావు, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ దీవన్, రిజిస్ట్రార్ ఆచార్య ఉష, రెక్టార్ ఆచార్య బసవేశ్వర రావు, డీఐసీ డిడి నాగేశ్వరరావు, ఎన్ఐసి అధికారులు సెల్వినా, ఫణి కుమార్, తహసిల్దారు మధుసూదన్, పారిశ్రామికవేత్తలు పలువురు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అడ్వకేట్ లకు ప్రొటెక్షన్ యాక్ట్ తప్పనిసరి

**అమలు అయ్యేవరకు పోరాడుదాం.**
**బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ. కె.భాషా పిలుపు**




విజయవాడ లీగల్, **నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఈ మధ్యకాలంలో న్యాయవాదుల మీద జరుగుతున్న దాడులకు నిరసనగా మరియు న్యాయవాదుల సంరక్షణ చట్టం అమలు చేయాలని డోన్ బార్ అసోసియేషన్ సభ్యులైన ఎల్ కృష్ణ ప్రసాద్ మరియు కె ఈశ్వరయ్య 01/11/2025 నుంచి డోన్ నుంచి పాదయాత్రను ప్రారంభించి ఈరోజు కి 11/11/2025 కి విజయవాడకు చేరుకొని బెజవాడ బార్ అసోసియేషన్ కు వచ్చారు. బెజవాడ బార్ అధ్యక్షులు అయిన ఎ కె బాష వారిని సాదరంగా ఆహ్వానించి వారు చేసే ఈ పాదయాత్రను గౌరవిస్తూ వారిని పూలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎ కె బాష బెజవాడ బార్ లో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ యొక్క ఆవశ్యకతను తెలియజేసి, ఎన్నికల సమయంలో ఇప్పుడు ఐటీ మంత్రి అయిన లోకేష్ పాదయాత్రలో న్యాయవాదులు పరిరక్షణ చట్టాన్ని అమలు చేస్తామని మాటిచ్చారని చట్టం అమలయ్యే వరకు మనం తప్పక పోరాడుదామని, మన న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలుకు డోన్ బార్ సభ్యులు చేస్తున్న




ఈ ప్రయత్నాలకు అందరం మద్దతు ఇవ్వాలని చెప్పి వారిని అభినందించారు. అదేవిధంగా సీనియర్ న్యాయవాది అయిన గొట్టిపాటి రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో న్యాయవాదులకు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తప్పనిసరి అని చట్టం అమలుకు తమ వంతు కృషి చేస్తామని అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బెజవాడ వారి అసోసియేషన్ నుంచి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ కార్యాచరణ కమిటీని రూపొందించి దానికి అధ్యక్షులుగా ఏఎస్ఎస్ రాంప్రసాద్ ని నియమించారు అదేవిధంగా కమిటీలో సభ్యులుగా బత్తుల సాయి, బై పూడి నాగేశ్వరరావు, సరస్వతి, పి జయలక్ష్మి గార్లను నియమించారు. వీరందరూ కలిసి త్వరితగతిన న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలుకు కార్యాచరణ రూపొందించి చట్టం అమలు జరిగేలా చూస్తారు. ఈ సందర్భంగా డోన్ బార్ అసోసియేషన్ సభ్యులైన ఎల్ కృష్ణ ప్రసాద్ మరియు కె ఈశ్వరయ్య మాట్లాడుతూ పాదయాత్రలోని వాళ్ల అనుభవాలను వివరించారు న్యాయవాదులు పరిరక్షణ చట్టం అమలయ్యే వరకు వారు పోరాడుతూనే ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జాయింట్ సెక్రెటరీ జి వరహాలక్ష్మి, గవర్నింగ్ బాడీ మరియు మాజీ సెక్రెటరీ అయినా ఏ రాజా పి రాంబాబు మరియు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# కుంటముక్కలలో పొలం పిలుస్తోంది



**జి.కొండూరు:నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు ఏఈఓ నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని కుంటముక్కల గ్రామంలో స్థానిక కూటమి నాయకులు, రైతులతో కలిసి ఖరీఫ్ పంటలను పరిశీలించారు.అనంతరం వచ్చే రబీ సీజన్లో రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో నాగరాజు రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ఈశ్వర్, మిల్క్ సొసైటీ అధ్యక్షులు లంక రామకృష్ణ వర ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ కార్యక్రమం





**ముదినేపల్లి నవంబర్ 11 (వార్త ప్రభ)** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా, ఈ రోజు ముదినేపల్లి మండలం గురజ గ్రామంలో రచ్చబండ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ"ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంటే, పేదలకు వైద్యం అందకుండా చేసే ప్రయత్నం.పిపిపి విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్తో కోటి సంతకాల సేకరణ చేపట్టాం. ఇది కేవలం సంతకం కాదు,కోటి గుండెల నిరసన. ప్రైవేటీకరణ జరిగితే పేద, మధ్యతరగతి విద్యార్థులు మెడికల్ చదవలేరు. అధిక ఫీజులతో విద్యను దూరం చేయాలనే కుట్రను అడ్డుకోవాలి" అని పిలుపునిచ్చారు.అలాగే,పిపిపి విధానాన్ని రద్దు చేసేంతవరకు, పార్టీలు, వర్గాలు, అభిప్రాయాలు పక్కనపెట్టి అందరూ ఈ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలి అని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి గంటా సంధ్య, జిల్లా అధికార ప్రతినిధి మొత్రు ఏసుబాబు, మండల వైస్ఎంపీపీ రాచురి రాధా, మండల పార్టీ అధ్యక్షులు బోయిన రామరాజు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాబక్షు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు మామిడిపల్లి రంగా వరప్రసాద్, రాచురి కుమార్, సాక్షి సాయిబాబు, మరీదు వసంతరావు, మీసాల రామకృష్ణ, ధగాని కోటేశ్వరరావు, పుట్టి కొండ, తదితర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కూనపురెడ్డి వెంకమ్మ చిత్రపటానికి నివాళు లర్పించిన మాజీ ఎమ్మెల్యే డిఎన్ఆర్.



**కైకలూరు, నవంబర్ 11 (వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు, కైకలూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఈరోజు మధ్యాహ్నం కైకలూరు మండలం పరిధిలోని కూనపురెడ్డి సత్యనారాయణ మాతృమూర్తి వెంకమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా దూలం నాగేశ్వరరావు వెంకమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ,"వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని, వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ కుటుంబ సభ్యులకు అండగా ఉండాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి %డ% ముదినేపల్లి మండల ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి గంటా సంధ్య, రాష్ట్ర మైనారిటీ విభాగ కార్యదర్శి ఎండి. గాలిబ్ బాబు, ముదినేపల్లి మండల పార్టీ అధ్యక్షులు బోయిన రామరాజు, కైకలూరు మండల పార్టీ అధ్యక్షులు సింగంశెట్టి రాంబాబు (రాము), జిల్లా అధికార ప్రతినిధి మొట్రూ యేసుబాబు, ముదినేపల్లి మండల మహిళా విభాగ అధ్యక్షురాలు రాచూరి రాధా, గణేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తఫా అహ్మద్ కు సత్కారం



**ఇబ్రహీంపట్నం, నవంబర్, 11(వార్తా ప్రభ ప్రతినిధి):** ఇటీవల ప్రారంభోత్సవం జరిగిన సేవా సదన్ కార్యాలయాన్ని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తఫా అహ్మద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సేవా సదన్ చేస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సమాజ శ్రేయసుకు కృషి చేస్తున్న సేవాసదన్ నిర్వాహకులు పైజాను అభినందించారు. అనంతరం సూఫీ సేవా సదన్ ఛైర్మన్ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మొహమ్మద్ పైజాన్ సాలువాతు సత్కరించి 20వ వార్షికోత్సవ మేమంటూ ను అహ్మద్ కు అందజేశారు. అనంతరం స్వతంత్ర సమరయోధులు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మౌలానా ఆజాద్ చిత్రపటాన్ని పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సేవాసదన నిర్వాహకులు షేక్ మొహమ్మద్, సల్మాన్, బషీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### పశ్చిమ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి కృషి...

**విజయవాడ పశ్చిమ నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి పశ్చిమ లో రోడ్లు, డ్రైనేజీల ,సమస్యలు పరిష్కరించడానికి ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. సమర్థవంతమైన నీటిపారుదల వ్యవస్థను మెరుగైన అభివృద్ధి ప్రణాళిక , జీవనశైలిని అందించడానికి ప్రయత్నం చేస్తున్నారు.ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, రిటైర్డ్ ఈ ఈ నారాయణమూర్తి , రిటైర్డ్ ఎస్ ఈ ఏ ఉదయ్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు కోగంటి రామారావు,ఈ ఈ శ్రీనివాస్, డీ ఈ రమేష్ మరియు కూటమి నేతలతో కలిసి భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు..

# కృష్ణాజిల్లా అభివృద్ధే తన ధ్యేయం

**అందరి సహకారంతో సంతోషంగా ఉద్యోగం చేస్తున్నాను.**
**తన చదువుకు సార్థకత కలిగింది-జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.**





**మచిలీపట్నం:నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆయన అతి సామాన్యంగా ఉంటారు. మనకు ఎంతో కాలం నుండి బాగా తెలిసిన వ్యక్తిగా కనిపిస్తారు. ఆయన మాటల్లో ఆప్యాయత ఎదుటివారిని కట్టిపడేస్తుంది. డాబు, దర్పం, అధికార హోదా ఇవేమీ ఆయనలో కనిపించవు. పని..పని. తను పనిచేస్తున్న ప్రతి జిల్లాలో, ఆ జిల్లాను అభివృద్ధి చేయడమే ఆయన అభిమతం. అందుకోసం తెల్లవారుజామునే బయలుదేరడం, తాను ఎంచుకున్న గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడం ప్రజలను కలుసుకొని వారి సమస్యలను తెలుసుకొని అందుకు సత్వరమే పరిష్కరించడం ఆయన పనితనం ఖరీదైన దుస్తులు ధరించరు. ఒక్కోసారి సాధారణ దుస్తులు ధరించే ప్రజల మాదిరిగానే అతి సాధారణమైన దుస్తులు ధరించి బయటికి వచ్చేస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు అందుకున్న మహోన్నతుడు. ఆయనే కృష్ణాజిల్లా కలెక్టర్ దసలుకుంటే కృష్ణయ్య శెట్టి బాలాజీ (డీకే బాలాజీ). 2024 ఎన్నికల ముందు కృష్ణాజిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన బాలాజీ తన విలక్షణమైన పనితో తాను పనిచేస్తూ, జిల్లా యంత్రాంగం తో పని చేయించడం ఆయన ప్రత్యేకం. అందుకె కృష్ణాజిల్లాను అభివృద్ధిలో అగ్రభాగంలో నిలపడానికి అహో రాత్రులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను అలుపెరుగక మంత్రులు, శాసనసభ సభ్యుల సహకారంతో అధికారులు సిబ్బందితో ప్రజలు మెచ్చే విధంగా పాలన చేస్తున్నారు. ఏ జిల్లా అభివృద్ధి చెందాలన్నా జిల్లా కలెక్టర్ పనితీరే ముఖ్యం

డీకే బాలాజీ అంటే డీ.... డెడికేషన్.... అంకిత భావం కే.... కమిట్మెంట్.... నిబద్ధత. బాలాజీ అంటే ఒక వెలుగు...డీకే బాలాజీ అంటే డెడికేటెడ్ కమిట్మెంట్ తో పని చేసి.... పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపటం అని అర్థం. ఐఏఎస్ కావాలనే ప్రేరణకు కారణం ఏమిటని విలేఖరి బాలాజీ ను ప్రశ్నించగా ఆయన ఒక్కసారిగా బాగోద్వేగానికి గురయ్యారు. గత అనుభవాలు, జ్ఞాపకాలు మదిలో మెదలాగా ఆయన చిరు గడ్డం ముఖంలో అనిర్వచనమైన ఆనందం కళ్ళల్లో మెరుపు. బాలాజీ స్వస్థలం కర్ణాటక రాష్ట్రం తమ్మకూరు జిల్లా తాలూకా హెడ్ క్వార్టర్ కొరటగిరి గ్రామం. ఆయన పదవ తరగతి వరకు తన గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్లోనే చదివారు. ఇంటర్మీడియట్ లో హిస్టరీ ఎకనామిక్స్ పొలిటికల్ సైన్స్ ఇన్ సోషియాలజీ తమకూరు జిల్లా సిద్ధం ఆర్ట్స్ కళాశాలలో చదివారు. బెంగళూరులోని బెంగళూరు యూనివర్సిటీ ఆర్ వి కళాశాలలో బిబిఏ, ఎంబీఏ చదివారు. చదువులో మొదటి స్థానంలోనే ఉండేవారు. డీకే బాలాజీ తండ్రి కర్ణాటక గ్రామీణ బ్యాంక్ లో అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేసేవారు.

**ఐఏఎస్ అవ్వాలని ప్రేరణ:**కొన్ని సంఘటనలు అనుకోని విధంగా విచిత్రంగా ఉంటాయి. ఒక్కోసారి ఆ సంఘటనలు మంచైనా ,చెడైనా మనసులో బలంగా నాటుకుంటాయి బాలాజీ జీవితంలో జరిగిన ఆనాటి ఘటన తన తండ్రి రూపంలో దైవమే పలికించినట్లయింది. అప్పుడు బాలాజీ వయసు 9 సంవత్సరాలు. 5వ తరగతి చదువుతున్నాడు. చురుగ్గా ఉండేవాడు. ఒకరోజు తండ్రి ఎందుకో కోపంగా ఉన్నాడు ఆ సమయంలో ఆడుకుంటున్న బాలాజీని తండ్రి కొట్టాడు అతను ఏడుస్తూ ఒక పక్కన కూర్చొని అందరితోపాటు టీవీ చూస్తున్నాడు. కర్ణాటకలోనీ ఉదయ టీవీ ప్రసార సమయంలో అడ్వర్టైజ్మెంట్లు వచ్చేవి. మధ్య మధ్యలో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు వచ్చేవి అందులో ఒక ప్రశ్న యాంకర్ అడిగింది

**ప్రశ్న :** ప్రపంచంలో మొట్టమొదటిగా మహిళలకు ఓటు హక్కు కల్పించిన దేశం ఏది ?

ఆ ప్రశ్న విన్న బాలాజీ వెంటనే ఎటువంటి తడబాటు లేకుండా స్పష్టంగా న్యూజిలాండ్ అని చెప్పాడు. బాలాజీని కొట్టిన కోపంతో ఉన్న తండ్రి బాలాజీ జవాబులకు ఆశ్చర్యపోయి ఒక్కసారిగా ఉత్సాహంగా కొడుకువైపు చూశాడు. అప్పటికే యాంకర్ బాలాజీ చెప్పింది కరెక్ట్ అని చెప్పింది. "వెంటనే తండ్రి బాలాజీని ఇది నీకు ఎలా తెలుసు?" అని ప్రశ్నించాడు. దానికి బాలాజీ ఒక పుస్తకంలో చదివాను అది గుర్తుంది అని చెప్పాడు. వెంటనే చాలా సంతోషంగా బాలాజీ తండ్రి, కొడుకుని దగ్గరకు తీసుకున్నాడు. కొడుకు మీద ఉన్న కోపం ఒక్కసారిగా పోయింది. ఆ క్షణంలో బాలాజీ లో ఒక ఉత్కంఠమైన, దృఢమైన ఆలోచన కలిగింది. ' బాగా చదివితే ఎవరూ ఏమీ అనరు' అందరు ప్రేమగా చూస్తారు. ' జనరల్ నాలెడ్జ్ పుస్తకాలే కాకుండా ఇంకా ఇతర పుస్తకాలు కూడా చదివితే గొప్పవారు కావచ్చు' అని అనుకొని ఆ పట్టుదలతో నిరంతరం ఆ ఆలోచనలతో ఎవరిని కలిసిన ఎవరితో మాట్లాడుతున్న అనగా ఉపాధ్యాయులు, డాక్టర్లు ,బంధువులు, స్నేహితులు బాగా చదువుకున్న వారిని ఒక్కటే అడిగేవాడు.- "దేశంలో అతి పెద్ద పరీక్ష ఏది"? "ఆ పరీక్ష రాస్తాను" అని అంటూ ఉండేవాడు. అందరూ ఐఏఎస్ అని చెప్పేవారు. అప్పటినుంచి బాలాజీ మనసులో ఐఏఎస్... ఐఏఎస్.... అంటూ పలవరింతలు. దీనికి తోడు బాలాజీ గ్రామానికి చెందిన జగదీష్ అనే యువకుడు 2005లో ఐఏఎస్ లో 58వ ర్యాంకు సాధించాడు. ఈ సంఘటన కూడా బాలాజీ మనసులో బాగా నాటుకు పోయింది. ఎంత కష్టమొచ్చినా ఐఏఎస్ అవ్వాలనే లక్ష్యంతో పుస్తకాలు బాగా చదవడం మొదలుపెట్టాడు. నోట్స్ రాసుకోవడం ,చదివింది మననం చేసుకోవడం ఇదే అతని దినచర్యగా అయ్యింది. ఫస్టు ప్రిలిమినరీ పరీక్ష అయింది. రెండో ప్రయత్నంలో ఆలిండియా 36వ ర్యాంకుతో బాలాజీ ఐఏఎస్ సాధించారు. తన ఆలోచనకు తన నిరంతర కృషి కి తన పట్టుదలకు ప్రజలకు సేవ చేయడానికి అవకాశం వచ్చింది. ఇది సామాన్యమైన విషయం కాదు. భవిష్యత్తుకు పూల పరిమళాలతో స్వాగతం పలికిన ఘడియ.

సాధారణంగా ఐఏఎస్ కు వెళ్లాలనుకునే వారు కోచింగ్ కోసం ఢిల్లీకి వెళ్తారు. కోచింగ్ కోసం ఎంత డబ్బు అయినా ఖర్చు పెడతారు. అయితే డీకే బాలాజీ మాత్రం తాను చదివిన పుస్తకాలనే కాకుండా బెంగళూరులోనే కోచింగ్ తీసుకున్నారు. ఆయన సబ్జెక్టు కన్నడ లిటరేచర్. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 2015-బ్యాచ్ IAS అధికారి డీకే బాలాజీ కృష్ణా జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేశారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, విశాఖపట్నం జిల్లాలోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేశారు. కర్నూలు కార్పొరేషన్ కమిషనర్‌గా 25,000 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించడం, కర్నూలు నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌ను మెరుగుపరచడం, కర్నూలు నగరంలో COVID-19 మహమ్మారిని విజయవంతంగా కట్టడి చేయడం మరియు ఏడు థీమ్ పార్కుల అభివృద్ధికి సహకరించడం వంటి వివిధ కార్యక్రమాలలో ఆయన కీలక పాత్ర పోషించారు. జిల్లా కలెక్టర్ గా మొట్టమొదటి పోస్టింగ్ కృష్ణాజిల్లా. మొదటిసారిగా ఐఏఎస్ ట్రైనింగ్ కృష్ణాజిల్లా కాగా, ఇప్పుడు జిల్లా కలెక్టర్గా కృష్ణా జిల్లాకు రావడం తన అదృష్టం అంటారు డీకే బాలాజీ. తాను కృష్ణాజిల్లా కలెక్టర్ గా ఉన్నంతవరకు మచిలీపట్నం తో పాటు కృష్ణాజిల్లాలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉన్నానని బాలాజీ చెప్పారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి కృష్ణాజిల్లా కి సంబంధించి అన్నీ వివరించి మచిలీపట్నం కు డ్రైనేజీ సిస్టం సాంక్షన్ గురించి అడగగానే ముఖ్యమంత్రి వెంటనే 13 కోట్ల రూపాయల శాంక్షన్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చేయాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఏర్పాటు చేయాలని కోరారు.అందుకు చంద్రబాబు నాయుడు గారు సానుకూలంగా స్పందించి అన్నీ చేస్తానని మాట ఇచ్చారని బాలాజీ వివరించారు. 2024 సంవత్సరంలో కృష్ణా జిల్లా కలెక్టర్‌గా, మచిలీపట్నం యానాదుల కాలనీలో ఆధార్ కార్డులు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్న యానాదులపై డికె బాలాజీ ప్రత్యేక శ్రద్ధ వహించి గిరిజన సంక్షేమ శాఖ సమన్వయంతో యానాదులకు ఆధార్ కార్డులు పొందేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా పాఠశాలల్లో "నాకు సాధ్యమే" అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థుల శ్రేయస్సు కోసం సృజనాత్మకంగా కృషి చేస్తున్నారు. ప్రతి నెలా 3వ శుక్రవారం, ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉద్యోగుల ఫిర్యాదుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి శనివారం కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లో కాలుష్య రహిత దినోత్సవాన్ని అమలు చేయటంతో పాటు స్వయంగా సైకిల్‌పై కలెక్టర్ కార్యాలయానికి వస్తూ కలెక్టరేట్ సిబ్బంది కి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో కృష్ణా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారిగా అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ డికె బాలాజీని బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డుకు ఎంపిక చేసింది. బాలాజీ "ఎథిక్స్ ఇంటిగ్రిటీ ఆప్టిట్యూడ్" అనే పుస్తకాన్ని రచించారు. ఇది సివిల్ సర్వీస్ కు ప్రిపేర్ అయ్యే వారికి ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఐఏఎస్ సాధించిన బాలాజీ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వారి లక్ష్యాలను సాధించడానికి ఒక ప్రేరణగా నిలుస్తున్నారు. తాను జిల్లా కలెక్టర్ గా అన్ని విధాల ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉన్నానని డీకే బాలాజీ చెప్పారు. మంత్రులు, శాసనసభ సభ్యులు, రాజకీయ నాయకులు తనకు అన్ని విధాల సహకారం అందిస్తున్నారనిబీ జిల్లాలోని అధికారులు, ఉద్యోగులందరూ సహకరిస్తున్నందుకు తాను ప్రజలకు సేవ చేయగలుగుతున్నానని అన్నారు. తాను ఎక్కడ ఉద్యోగం చేస్తున్నా ప్రజల మధ్యనే ఉంటానని డీకే బాలాజీ స్పష్టం చేశారు. ఒక ఉన్నత ప్రభుత్వ ఉద్యోగి, ఉద్యోగ ధర్మం లో సంతోషంగా ఉన్నానని చెబుతున్నారంటే అంతకంటే ఇంకేం కావాలి. డీకే బాలాజీ అంటే అంకితభావంతో నిబద్ధతగా పనిచేసే ఒక మహోన్నతమైన వెలుగు.

## జాతీయ పక్షి వీక్షణా దినోత్సవం

**(సలీం అలీ జయంతి)**



ప్రకృతిలో మానవులు,జంతువులతో పక్షులు కూడా ఒక భాగంగా ఉన్నాయి. జీవపరిణామ క్రమంలో పక్షులు 15 కోట్ల సంవత్సరంల క్రితం ఉద్భవించినట్లు చరిత్ర చెబుతుంది. సుమారు 8,500పక్షి జాతులున్నట్లుగా గుర్తించడం జరిగింది.రంగు రంగులఈకలు ఉండడం పక్షులకే సొంతం. వివిధ రంగులతో ఇట్టే కట్టిపడేసే పక్షులు కనిపిస్తాయి.పక్షి అందాలను చూసి ఆనందించని హృదయం బహుశా ఉండదేమే. పూర్వకాలంలో కొన్ని పక్షులకు శిక్షణనిచ్చి సమాచారాన్ని అందించేలా సమాచార సాధనాలుగా వినియోగించేవారు. గతకాలంలో మానవుడు వేకువజామున పక్షుల కిలకిలారావాలకి ఆనందంగా నిద్రలేచి ఉత్సాహంగా దైనందిన కార్యక్రమాలు ప్రారంభించేవాడు.పంటలను పాడు చేయు పురుగులను తిని పక్షులు పంటలను కాపాడి, రైతుమిత్రులుగా ఉంటాయి.గతంలో మానవుడు పక్షులను సంరక్షించేవాడు.వాటికి ఆహారాన్ని సమకూర్చేవాడు. ప్రస్తుత కాలంలో పక్షులు మానవుని చర్యలతో నిర్లక్ష్యానికి గురౌతున్నాయి.మానవులు వేట వల్ల, ఆధునిక కాలంలో సాంకేతికత ద్వారా ఉత్పన్నమయ్యే రేడియేషన్ వల్ల, విష వాయువుల వల్ల, విషపదార్థాల వల్ల,పంటలపై చల్లే క్రిమి సంహారక మందుల వల్ల కొన్ని రకాల పక్షి జాతులు అంతరించి పోతున్నాయి. పక్షులను కాపాడాలనే ఉద్దేశంతో పక్షి ప్రేమికుడైన సలీమ్ అలీ జన్మదినమైన నవంబరు 12వ తేదీన "జాతీయ పక్షి వీక్షణా దినోత్సవం" దినోత్సవంగా జరుపుకుంటున్నాము. సలీం అలీ కచ్ ప్రాంతానికి చెందిన సంపన్న త్యాబ్జీ వ్యాపారుల కుటుంబంలో 1896 నవంబరు 12వ తేదీన10 వ సంతానంగా జన్మించారు.ఈయన చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి మేనమామ సంరక్షణలో పెరిగి పెద్దవాడయ్యాడు. సలీం చిన్న తనంలో తన ఎయిర్ గన్ తో ఒక పిచ్చుకను కాల్చాడు.తరువాత ఆ పిచ్చుకను గమనించగా దాని మెడ క్రింద బంగారు ఛాయతో ఒక చారను గమనించి ఆశ్చర్యపడ్డాడు. ఆ పక్షి పేరేమిటని అనేకులను అడిగినా లాభం లేకపోయింది. ఆ అనుమానం తీర్చుకోడానికి ఆ పిచ్చుకను పక్షుల గురించి అధ్యయనం చేస్తున్న డబ్ల్యు.యస్.మిల్లర్డ్ వద్దకు తీసుకువెళ్ళగా దాని పేరు ఎల్లో థ్రోటెడ్ స్పేరో అని తెలుసుకున్నాడు. సలీం కు పక్షుల గురించిన అనేక ఆసక్తికరమైన విషయాలను మిల్లర్డ్ తెలిపాడు.ఈ విధంగా ఆయన సలీం అలీ కి తొలి గురువు అయ్యాడు. నాటి నుండీ పక్షులను హింసించడం మానేసి పక్షుల పై అధ్యయనం చేయడం ప్రారంభించాడు. బొంబాయి , బర్మాలలో ఈయన విద్యాభ్యాసం సాగింది. పక్షి శాస్త్రవేత్తలకు అంతగా గుర్తింపు లేదని తెలిసినా... పక్షుల పై ఉన్న మక్కువతో పక్షి శాస్త్రం అధ్యయనం చేశాడు. తెహమినా తో వివాహం జరిగింది. ఉద్యోగం లభించక అనేక ఇబ్బందులకు గురయ్యాడు. 1930లో 'గిజిగాడు పక్షి జీవన విధానం'పై ఈయన రాసిన ఆర్టికల్ మంచి పేరుని తెచ్చి పెట్టింది.1939లో భార్యను కోల్పోయారు.200 సంవత్సరాల చరిత్ర కల్గిన బొంబాయి నేచురల్ హిస్టరీ సోసైటి మూత పడకుండా ఎంతగానో కృషి చేశాడు. అప్పటి ప్రధాని నెహ్రూ చే ఆర్థిక సహాయం పొందేలాచేశాడు. భరత్పూర్ పక్షి పరిరక్షణ వనం, సైలెంట్ వాలి నేషనల్ పార్క్ ల సంరక్షణ లో ప్రముఖ పాత్ర వహించారు. 'ద బుక్ ఆఫ్ ఇండియన్ బర్డ్స్' అనే పుస్తకాన్ని, ద బర్డ్ ఆఫ్ కచ్, ఇండియన్ హిల్ బర్డ్స్, ద బర్డ్స్ ఆఫ్ ట్రావెన్కోర్ అండ్ కొచ్చిన్, ద బర్డ్స్ ఆఫ్ సిక్కిం, ద బర్డ్స్ఆఫ్ కేరళ, కామన్ బర్డ్స్, ద బర్డ్స్ ఆఫ్ ఈస్టర్న్ హిమాలయన్స్, ద గ్రేట్ ఇండియన్ బస్టర్డ్, హ్యాండ్ బుక్ ఆఫ్ బర్డ్స్ఆఫ్ ఇండియా అండ్ పాకిస్థాన్ మొదలైన రచనలతో పాటుగా 'ద ఫాల్ ఆఫ్ స్పారో' పేరున ఆత్మకథను రాసుకున్నాడు.ఈయన పేరుతో 1990 లో కోయంబత్తూరు అనైకట్టిలో 'సలీమ్ అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ అండ్ నేచురల్ హిస్టరీ' ని ఏర్పాటు చేశారు. సలీం అలీని పక్షులపై చేసిన పరిశోధనలకు గుర్తింపుగా 'పద్మభూషణ్' పురస్కారంను, బ్రిటీషేతరులకు చాలా అరుదుగా ఇచ్చే 'బ్రిటిష్ ఆర్నిథాలజిస్ట్స్ యూనియన్ మెడల్' ను, 'జాన్ ఫిలిప్స్ మెడల్','పద్మవిభూషణ్' మొదలైన పురస్కారాలను అందించారు. పక్షులపై అవిశ్రాంతంగా కృషి చేస్తూ,పక్షి ప్రేమికుడిగా పేరుపొందిన సలీమ్ అలీ 1987 జూన్ 20న ప్రోస్టేట్ క్యాన్సర్ తో కన్నుమూశారు. పక్షుల పై చేసిన పరిశోధనలద్వారా చేసిన కృషినిబట్టి సలీమ్ అలీని 'భారతీయ పక్షి మనిషి' అని పిలుస్తారు. ఏదైనా పక్షి గూడులో నుండి క్రిందపడినా లేక ప్రమాదంలో గాయపడినా,ఆ గాయాలను శుభ్రపరచి, ప్రథమ చికిత్స చేసి ఆ పక్షి గూడులో గాని, సురక్షితంగా, స్వేచ్ఛగాఉండే ప్రదేశాలలోనో ఉంచాలి. ప్రకృతి సమతుల్యాన్ని కాపాడే పక్షులను హింసించడం మాని, వాటిని ప్రేమిస్తూ... సంరక్షిస్తూ... వాటి అభివృద్ధికి సహకరించడమే సలీమ్ అలీకి మనం అర్పించే నిజమైన నివాళి.

**-కొల్లాబత్తుల సూర్య కుమార్**

## దేశంలో గుణాత్మక విద్యకు మార్గదర్శి అబ్దుల్ కలాం ఆజాద్

**ఆచార్య తాళ్ళ సుమాలిని**





**శేరిలింగంపల్లి,నవంబర్ 11 (వార్తాప్రభ):** జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాపూర్ డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా స్వతంత్ర భారతావని తొలి విద్యాశాఖా మంత్రి,భారతరత్న అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని రిహానా బేగం అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా హైదరాబాదు కేంద్రీయ విశ్వ విద్యాలయం ఎడ్యుకేషన్ అండ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ డిపార్టుమెంటుకు చెందిన ఆచార్య తాళ్ళ సుమాలిని హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలో గుణాత్మక విద్యకు మార్గదర్శి,విద్యాభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు.ఆజాద్ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడని,స్వాతంత్రోద్యమంలో పది సంవత్సరాల కారాగార శిక్షను అనుభవించిన స్వాతంత్ర్య సమరయోధుడని,ఆజాద్ పండితుడు,కవి,సంపాదకుడు, గొప్ప రాజనీతిజ్ఞుడు అని అన్నారు.ఆయన బహుభాషా కోవిదుడని,స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వంలో 11 సంవత్సరాల పాటు విద్యా శాఖామంత్రిగా కొనసాగి విద్యా సంస్కరణలకు విశేష కృషి చేశారని తెలిపారు.ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1992లో మన దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నతో గౌరవించి ఆయన జన్మదినమైన నవంబరు 11ను 2008వ సంవత్సరం నుండి జాతీయ విద్యా దినోత్సవంగా ప్రకటించి అమలు చేయడం జరుగుతుందన్నారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని,పౌష్టికాహారం తీసుకుంటూ నిత్య వ్యాయామం, ధ్యానం ఆచరించి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ ఆఫీసరు భాస్కర్ రెడ్డి,అధ్యాపకులు జి.రాములు,జి.హన్మంతు,కె.మోహన్,మహేష్ గౌడ్,జగదీష్,విద్యార్థినీ,విద్యార్థులు,ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు తగిలి ఆవు దూడకు తీవ్ర గాయాలు

**ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని నిరసన**

**పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం**



**జగ్గయ్యపేట నవంబర్ 11 (వార్త ప్రభ )** ఆర్టీసీ బస్సు తగిలి ఆవు దూడకు తీవ్ర గాయాలైన సంఘటన ఆర్టీసీ బస్టాండ్ లో జరిగింది. సోమవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ ఇన్ గేటు ప్రాంతంలో ఉన్న ఆవు దూడను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఆవు దూడకు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న హిందువు చైతన్య వేదిక పట్టణ అధ్యక్షుడు సంక భాస్కర్, గోసంరక్షకులు ఆ ప్రాంతానికి చేరుకొని ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి దూడను ఢీకొనటం జరిగిందని నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ డిఎం కు విషయం తెలియజేసిన స్పందించలేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడ చేరుకున్న పోలీసులు ఆర్టీసీ డిఎం ను అధికారుల తో గోసంరక్షకులతో మాట్లాడి వివాదాన్ని పరిష్కరించారు. ఆర్టీసీ బస్సులు లోపలికి వచ్చేటప్పుడు స్పీడ్ తగ్గించి లోపలికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారు. ఇటీవల కాలంలో అదే ప్రాంతంలో బస్సు ఢీకొని ఒకరు మృతి చెందిన విషయం ప్రస్తావిస్తూ ఆర్టీసీ అధికారులు పూర్తిస్థాయిలో ప్రమాదాలు జరగకుండాచర్యలు తీసుకోవాలని హిందూ చేతన వేదిక పట్టణ భాస్కర్ కోరారు.

## ప్రైవేట్ కళాశాలల బస్సులను తనిఖీలు చేపట్టండి

**ప్రమాదాలను అరికట్టండి**



**కాకినాడ,నవంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కాకినాడలో మంగళవారం సాయంత్రం సాంబమూర్తి నగర్ లో శ్రీ చైతన్య కాలేజీ బస్ అదే కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి కంబాల యువన్ శంకర్ ఢీ కొట్టడంతో మృతి చెందడం జరిగింది.మంగళవారం ఉదయం మృతుని కుటుంబ సభ్యులు, దుమ్ములు పేట పెద్దలు, మాజీ కార్పొరేటర్లు, విద్యార్థుల ఆధ్వర్యంలో బాధితు కుటుంబానికి న్యాయం చేయాలని, యువ శంకరాన్ కుటుంబాన్ని ఆదుకోవాలని, నష్టపరిహారాన్ని చెల్లించాలని నినాదాలతో ఆందోళన నిరసనలు నిర్వహించడం జరిగింది. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ కుటుంబకులు చేస్తున్న ఆందోళన నిరసనకు మద్దతు తెలియజేశారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటీ కాలేజీల్లో చదివేందుకు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని, ఫీజులు సకాలంలో చెల్లించుకుంటే అనేక రకాలుగా విద్యార్థులను ఇబ్బందులు గురి చేస్తూ పనిష్మెంట్లు విధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీ బస్సులలో సుమారుగా 40 పైగా విద్యార్థులు ప్రయాణిస్తారని,40 మంది విద్యార్థుల ప్రాణాలు బస్సులు నడిపే డ్రైవర్ చేతిలో ఉంటాయని, అలాంటి డ్రైవర్లను ఎన్నికి చేయడంలో ప్రైవేట్ యాజమాన్యం విఫలం చెందుతున్నారని ఆయన అన్నారు. డ్రైవర్లకు తక్కువ వేతనాలు మంజూరు చేస్తూ వయసు పైబడినవారితో బస్సులు నడపడం నిర్వహిస్తున్నారని, దీని ద్వారా అధిక స్థాయిలో ప్రమాదాలు వచ్చే పరిస్థితి ఉందని, దీనికి నిదర్శనమే యువన్ శంకర్ మృతి అని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రైవేటు కళాశాలల బస్సులను తనిఖీలు చేయాలని, వయసు పైబడిన వారిని తక్కువ వేతనాలు ఇచ్చి డ్రైవర్నియమించుకునే పద్ధతి మానుకుని ప్రమాదాలు నివారించాలని ఆయన అన్నారు.

# ఖబర్దార్ ఉగ్రవాదుల్లారా!!

**● ఉగ్రవాదం మెడలు వంచి భూస్థాపితం చేస్తాం ● మారణకాండతో దేశ అభివృద్ధిని అడ్డుకోలేరు ● ముష్కరుల ప్రతి కుట్రను మోడీ ప్రభుత్వం తిప్పి కొడుతుంది ● దాడులతో దేశ స్థైర్యాన్ని దెబ్బతీయలేరు ● ఢిల్లీ బాంబు దాడి దిగ్భ్రాంతిని కలిగిస్తున్నది ● ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతి ● క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి ● రామగుండం బిజెపి మహిళా నేత కందుల సంధ్యారాణి**



**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)** ఖబర్దార్ ఉగ్రవాదుల్లారా, ఉగ్రవాదం మెడలు వంచి భూస్థాపితం చేస్తాం అని సోమవారం ఢిల్లీ బాంబ్ బ్లాస్టింగ్ ఘటన నేపథ్యంలో తీవ్రస్థాయిలో ఉగ్రవాదంపై కన్నెర్ర చేశారు రామగుండం బిజెపి మహిళా నేత కందుల సంధ్యారాణి. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఎన్టిపిసి మేడిపల్లి సెంటర్ చౌరస్తాలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఉగ్రవాద దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మీడియాతో మాట్లాడుతూ...... .మారణకాండతో, బాంబు దాడులతో, అల్లర్లతో దేశ అభివృద్ధిని అడ్డుకోలేరు అని అన్నారు. ముష్కరుల ప్రతి కుట్రను మోడీ ప్రభుత్వం తిప్పి కొడుతుంది అని అన్నారు. దాడులతో దేశ స్థైర్యాన్ని దెబ్బతీయలేరు అని అన్నారు. పిరికిపంద చర్యలు చేపడుతూ అల్లర్లకు ఆద్యం పోస్తూ, దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించే విధంగా చేస్తున్న ఉగ్రమూకల భరతం శాశ్వతంగా పట్టే రోజులు దగ్గర పడుతున్నాయని అన్నారు. ఢిల్లీ బాంబు దాడి దిగ్భ్రాంతిని కలిగిస్తున్నది అని ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు అలాగే సంఘటనలో గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి అని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ దిష్టిబొమ్మ దహన కార్యక్రమంలో గాండ్ల ధర్మపురి,ఎన్టిపిసి మండల అధ్యక్షులు మిట్టపల్లి సతీష్ కుమార్, ఇదునూరి చిరంజీవి, చిలువేరు అంజి, లింగరాజు, ఈదునూరి శ్రీకాంత్, సాహూ సంతోష్, కాంతాల సంతోష్ రెడ్డి, గోలివాడ శ్రీకాంత్, శివ ఓర్చు, రమేష్, సాయి, కందుకూరి సతీష్, వెంకటేష్, సంపత్, జి శ్రీధర్, మిట్టపల్లి రవి గౌడ్, మేకల నారాయణ, మంథని శివకుమార్, పల్లికొండ తిరుపతి, రాకేష్, సంతోష్, నల్లి నరేష్, ఈదునూరి శంకర్, పల్లికొండ నర్సింగ్ ,మేకల సదానందం, తోట రవి, మందపల్లి శ్రీకాంత్, కుందారపు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఖరీఫ్ ధాన్యానికి మద్దతు ధర మంత్రి డాక్టర్.నారాయణ





**కాకినాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** రైతుల ఖరీఫ్ ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తూ నిర్దేశిత 3 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యాన్ని మించి కొనుగోళ్లు జరిపేందుకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా.పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ హాలులో కాకినాడ జిల్లా సమీక్షా కమిటీ 5వ సమావేశం జిల్లా ఇన్చార్జి మంత్రి డా.పొంగూరు నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు షణ్మోహన్ సగిలి, కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎంఎల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, వరుపుల సత్యప్రభ, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, మాజీ జడ్పీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ పాల్గొని జిల్లా అభివృద్ధి, సమస్యల పరిష్కారం అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తొలుత జిల్లా కలెక్టరు షణ్మోహన్ సగిలి గత జూలై నెలలో జరిగిన కమిటీ 4వ సమావేశంలో చర్చించిన అంశాలపై చేపట్టిన చర్యలను మంత్రి, సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పియం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలులో ఇప్పటి వరకూ 12.428 మెగావాట్ల సామ-ర్థ్యం కలిగిన 2200 రూఫ్ టాప్ యూనిట్ల ఏర్పాటు ద్వారా ఈపిడిసిఎల్ పరిధిలోని జిల్లాల్లో కాకినాడ జిల్లా అగ్రస్థానంలో కొనసాగుతున్నందుకు మంత్రి నారాయణ అధికారులను అభినందించారు. రూఫ్ టాప్ యూనిట్లలో నాణ్యమైన సోలార్ పానెళ్లు ఏర్పాటు చేసేలా చూడాలని ఆయన సూచించారు. అలాగే జిల్లాలోని మొత్తం 72 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల కంప్యూటీకరణ పూర్తిచేయడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేసారు. సముద్రంలోకి వృధాగా పోతున్న 2 టియంసిల ఏలేరు జలాలను గరిష్ట స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు ఎమ్మెల్యేలు చేసిన సూచనల కనుగుణంగా ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు 18 కోట్లు, అలాగే రానున్న గోదావరి పుష్కరాల నేపధ్యంలో జిల్లాలోని గోదావరి కాలువలపై ఉన్న 11 స్నాన ఘట్టాల అభివృద్దికి 55 లక్షలు నిధులు వచ్చాయని, పనులు త్వరలో చేపట్ట నున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే ఉప్పాడ, కోనపాపపేటల వద్ద సముద్రతీర కోత నివారణకు రాతి రక్షణ గోడ నిర్మాణాన్ని 16 కోట్ల నిధులతో చేపట్టేలా మారిటైం బోర్డుకు ప్రతిపాదించామని ఆయన తెలిపారు. అజెండా సమీక్షలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు కాకినాడ జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మంత్రికి వివరించారు. జిల్లాలో ఈ ఖరీఫ్ లో 2.24 లక్షల ఎకరాలలో రైతులు సాగు చేపట్టగా 5.92 లక్షల దిగుబడి అంచనా వేయడం జరిగిందని, ఇందులో స్థానిక వినియోగం పోనూ సుమారు 5 లక్షల టన్నులు మార్కెట్ కు రానుందని డియం తెలిపారు. కేంద్ర కార్యాలయం జిల్లాకు 3 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం నిర్ధేశించిందని, ఈ లక్ష్య సాధనకు జిల్లాలోని 20 మండలాల్లో 269 ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను నిర్వహిస్తున్నామని, గండేపల్లి, కరప మండలాల్లో కొనుగోళ్లు ప్రారంభం కాగా, ఇప్పటి వరకూ 56 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు జరిపామని తెలియజేశారు. ధాన్యం కొనుగోళ్ల సజావుగా నిర్వహించేందుకు అవసరమైన గోను సంచెలు, కూలీలు, వాహనాలు, పిపిసి కిట్లు తగిన సంఖ్యలో ఏర్పాటు చేయాలని, రైతులకు మద్దతు ధర కల్పిస్తూ నిర్ధేశించిన లక్ష్యాన్ని మించి కొనుగోళ్ల జరపాలని ఇన్చార్జి మంత్రి అధికారులను కోరారు. అలాగే మున్సిపాలిటీలలో లెగసీ చెత్త తొలగింపు ప్రగతిని మంత్రి కమీషనర్లతో సమీక్షించారు. ఇప్పటి వం-కూ సామర్లకోట, పెద్దాపురం, గొల్లప్రోలు, పిఠాపురం, తుని పట్టనాల్లో నూరు శాతం చెత్త తరలింపు పూర్తి చేసారన్నారు. కాకినాడ నగరంలో 74 శాతం, ఏలేశ్వరంలో 2.57 శాతం తరలింపు పూర్తయిందని, డిశంబరు మాసాంతాని నూరు శాతం సాధించాలని ఆదేశించారు. హౌసింగ్ సమీక్షలో జిల్లాలోని అన్ని నియోజక వర్గాలలో బుధవారం లబ్దిదారుల సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు పండుగ వాతావరణంలో నిర్వహించాలని కోరారు. లబ్దిదారుల జియోటాగింగ్ లో ఎదురౌతున్న సమస్యలపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో చర్చిస్తామన్నారు. అనంతరం వివిధ అంశాలపై జరిగిన చర్చలో పుష్కర ఘాట్ ల అభివృద్ధితో బాటు పుష్కరాల సమయంలో జిల్లాలో పెద్ద ఎత్తున పెద్ద ఎత్తున తరలి వచ్చే ప్రముఖ పుణ్యక్షేత్రాల వద్ద కూడా భక్తుల కొరకు సౌకర్యాలు అభివృద్ధి చేయాలని, జల్ జీవన్ మిషన్ క్రింద నిర్వహించిన పనులపై రాండమ్ చెక్ నిర్వహించాలని, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. అసంపూర్తిగా మిగిలిపోయిన స్మార్టు సిటీ పనులను పూర్తి చేయించాలని, సాగరమాల పథకం క్రింద చేపట్టిన రోడ్డు పనులు వేగవంతం చేయాలని, కాకినాడ నగరంలో 6 సమీప గ్రామాల సత్వర విలీనానికి చర్యలు చేపట్టాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు కోరారు. శిధిలమైన ఏలేశ్వరం-జడ్డంగి అన్నవరం రోడ్డు, రాజుపాలెం-రామవరం రోడ్డు లకు కనీసం రిపేర్లు అయినా నిర్వహించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, మాజీ జడ్పి చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ కోరారు. అప్పుల భారంతో శుష్కించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకును తిరిగి ఆర్థికంగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1000 కోట్లు షేర్ కాపిటల్ అసిస్టెన్స్ ఇవ్వాలని డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు మంత్రిని కోరారు.

## దేశ అభివృద్ధికి ఆజాద్ కృషి అభినందనీయం



**గుడివాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** స్థానిక మౌలానా అబుల్ కలాం ఆజాద్ మదర్సాలో స్వతంత్ర సమరయోధుడు స్వర్గీయ అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం ఆజాద్ చేసిన పోరాటాలు, దేశ అభివృద్ధికి చేసిన కృషిని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ పెద్దలు షేక్ ఇబ్రహీం, సయ్యద్ జబీన్, షేక్ సర్కార్, జానీ షరీఫ్, అబ్దుల్ మున్వర్, ఖాజీ ఖలీల్ రెహమాన్, హఫీజి హబీబుల్లా, హఫీజ్ అబ్దుల్ అలీమ్,ముక్తి మహమ్మద్ ముజీబ్, హఫీజ్ శంషాద్, హఫీజ్ అహ్మద్,ఇమామ్ మెహమూద్,హఫీజ్ అబ్దుల్ ఇబ్రహీం, ఖాజీ ఖలీల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడ మానవత ప్రథమ అధ్యక్షుడు గుత్తా రమేష్ జయంతి వేడుకలు

### -అన్న క్యాంటీన్ లో పేదలకు అన్నదానం..




**గుడివాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** మంగళవారం మధ్యాహ్నం ఎ.జి.కె హైస్కూల్ ప్రక్కనగల అన్నాకేంటీన్ నందు గుడివాడ మానవతాశాఖ వ్యవస్థాపకులు ప్రథమ అధ్యక్షులు స్వర్గీయ గుత్తా రమేష్ గారి 76 వ జయంతి సందర్భంగా వారి కుమారులు రత్నప్రసాద్, ఫణి ప్రసాద్ లు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ మానవతాశాఖ అధ్యక్షులు దండమూడి సీతారామ స్వామి, చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, కార్యదర్శి నందమూరి పద్మజ, ట్రెజరర్ బచ్చు రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు ఘంటసాల రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ చలువాది మోహనరావు, కార్యవర్గసభ్యులు ఘంటా చంద్రశేఖరరావు, సామిరామమోహనరావు, మానవతాసభ్యులు కోన రామారావు, శైలజ, గుత్తా రమేష్ గారి పెద్ద కుమారుడు రత్నప్రసాద్ లు పాల్గొన్నారు.

## గన్నమనేనిని పరామర్శించిన మానవత కుటుంబ సభ్యులు



**గుడివాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** మానవతా కుటుంబసభ్యులు గన్నమనేని వెంకటేశ్వరరావు (రిటైర్డ్ టీచర్) మోకాళ్ళు ఆపరేషన్ చేయించుకొన్నందు వలన వారి స్వగృహానికి వెళ్ళి, మానవతాసభ్యులు నైతిక సహకారం అందించి పరామర్శించడం జరిగింది. ఆ దంపతులు ఎంతో సంతోషపడినారు, ఈ కార్యక్రమంలో గుడివాడ మానవతాశాఖ అధ్యక్షులు దండమూడి సీతారామ స్వామి, చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, కార్యదర్శి నందమూరి పద్మజ, బచ్చు రాధాకృష్ణ (కోశాధికారి) ఉపాధ్యక్షులు ఘంటసాల రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ చలువాది మోహనరావు, కార్యవర్గ సభ్యులు ఘంటా చంద్రశేఖరరావు, మానవతా సభ్యులు కోన రామారావు, శైలజ లు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులు

**●నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు ● వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్ ప్రెన్యూర్ దిశగా అడుగులు ● ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుతో ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు ● -ఆర్ డి వొ కావూరి చైతన్య ● చంద్రగూడెం గ్రామ శివారు లో ఎఫ్ ఎఫ్ సి నిర్మాణానికి శంకుస్థాపన**






**మైలవరం,నవంబర్ 11 (వార్తాప్రభ) :** ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులు నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని,ఈ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుతో ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని విజయ-వాడ రెవెన్యూ డివిజనల్ అధికారి (RDO) కావూరు చైతన్య పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండలం చంద్రగూడెం గ్రామ శివారులో 6.21 ఎకరాలలో రూ. 14.50 కోట్లు వ్యయంతో ఏర్పాటుకానున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సుకు (FFC) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కనిగిరి నుంచి వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. అనంతరం మైలవరం ఏఎంసీ చైర్మన్ పొనకల్ల నవ్యశ్రీ, గ్రామ సర్పంచ్ బోలగాని శ్రీనివాసరావు, పిఏసిఎస్ చైర్మన్ మోర్ల వెంకట రోశాలు ఆర్ డి వొ చైతన్య తో కలిసి శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సబ్ కలెక్టర్ చైతన్య మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో పారిశ్రామిక యూనిట్లను స్థాపించి తమ కాళ్లపై తాము నిలబడటమే కాకుండా పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి మహిళలు, యువత ఎదగాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ ఎఫ్ సి లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. చంద్రగూడెం పరిధిలో మొదటి దశలో 2 ఎకరాలలో 26,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక సదుపాయాలతో కూడిన ఫ్యాక్టరీ సముదాయం నిర్మాణం జరుగుతుందని ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో APIIC ద్వారా అమలవు తుందని తెలియజేశారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్ ప్రెన్యూర్ దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. ఈ ఎఫ్ ఎఫ్ సి మోడల్ ద్వారా చిన్న వ్యాపారులు తక్కువ పెట్టుబడితో తమ యూనిట్లను ప్రారంభించి నడుపుకోవడా నికి అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టులో అంతర్గత రోడ్లు, వర్షపు నీటి పారుదల వ్యవస్థ, పార్కింగ్ ప్రదేశాలు, అండర్ గ్రౌండ్ వాటర్ సంప్ వంటి మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ద్వారా మైలవరం ప్రాంతం పరిశ్రమల అభివృద్ధికి ఒక కేంద్ర బిందువుగా మారి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనుంద ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.రజని కుమారి, స్థానిక తహశీల్దారు అబ్దుల్ దరియా, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.అనురాధ, హౌసింగ్ డిఇ బి.పిచ్చయ్య, హౌసింగ్ ఏఈ ఎం. మారేశ్వరరావు,కొండపల్లి ఐల మేనేజర్ భాస్కర్ రావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖ అధికారులు, ఎం ఎస్ కె లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సాయి నాయి బ్రహ్మణ సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన





**గుడివాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని బడుగు వర్గాలకు అండగా సియం చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి అన్నివేళలా అండగా ఉంటుందని పద్మశ్రీ అవార్డు గ్రహీతలు దండమూడి సుమతిరామోహనరావు, దాలిపర్తి ఉమామహేశ్వరిలు అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో నాయి బ్రహ్మణ సంక్షేమ సంఘం నియోజవర్గ అధ్యక్షులు దేవరపల్లి కోటి అధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిబ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సురవరపు నాగరాజు, స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు చేకూరి జగన్మోహనరావు, పద్రాజు సాంబయ్య, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, సంఘీయుల నాయకుడు డిఆర్కె ప్రసాద్, విక్కృతి పోతురాజు, గండికోట వెంకటశివా, రామకృష్ణ, విక్రమ్, దుర్గప్రసాద్, విజయ్కుమార్లు మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో బిసి వర్గాలు కూటమి ప్రభుత్వ రావడానికి కృషి చేశారన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నాయి బ్రహ్మణ సంఘీయుల అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. తదనతరం వన సమారాధనలో భాగంగా నిర్వహించిన వనభోజనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ నాయి బ్రహ్మణ సంక్షేమ సంఘ సభ్యులు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## కృష్ణాజిల్లా అండర్ టెబుల్ టెన్నిస్ సెలక్షన్స్‌లో డా॥కె.కెఆర్ గౌతమ్ విద్యార్థుల అర్హత




**గుడివాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** విజయవాడలో ఈ నెల 9వ తేదిన నిర్వహించిన కృష్ణాజిల్లా అండర్ – 15టెబుల్ టెన్నీస్ సెలక్షనలో గుడివాడకు చెందిన డా॥కెకెఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ పి.లక్ష్మీప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈఈ సెలక్షన్‌లో పి.ఎల్ తేజశ్రీ, ఎల్.పార్వతిషణుశ్రీ, ఎ.తనిరిక, కె.గీతమ్‌కృష్ణ, వి,యోగిత్, పి.విలోక్‌కృష్ణా, కె.దినీష్‌లు ఈ నెల 17వ తేది నుండి జరిగే స్టేట్ టేబుల్ టెన్నీస్‌కి అర్హత సాధించడం గొప్ప విషయన్నారు. ఈ పోటిలలో విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చిన కోచ్ ఎస్‌కె గౌస్‌భాషా, విద్యార్థులను వివిధ సెక్షనల ప్రిన్సిపల్స్ సత్యరామ్, జ్యోతి, ప్రశాంతిలు అభినందిచారు.

## నారాయణపురంలో హెల్త్ డ్రైవ్



**హనుమాన్ జంక్షన్,నవంబర్ 11 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం వీరవల్లి పంచాయతీ పరిధి నారాయణపురంలో ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ కిరణ్మయి ఆధ్వర్యంలో హెల్త్ డ్రైవ్ నిర్వహించారు. విష జర్వాలు విజృంభిస్తున్న నేపధ్యంలో ఇంటింటికి వెళ్లి ఎవరైనా జర్వంతో బాధపడుతున్నారని సర్వే చేశారు.. జర్వం వచ్చినట్లు అనుమానంగా ఉంటే సమాచారం తెలియజేయాలని సచివాలయం ఏఎన్ ఎం ఆశా కార్యకర్తలు మందులు ఇస్తారని అంతకి నయం కాకపోతే పిహెచ్ సి వచ్చి వైద్య పరీక్షిలు చేయించుకో వాలని సూచించారు. నారాయణపురం జర్వం కేసులు చాలా తక్కువగా ఉన్నాయి పూర్తిగా అదుపులో ఉందని వైద్యురాలు కిరణ్మయి తెలిపారు. జర్వం కేసులు ఎక్కవగా నమోదు అయితే వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో హెచ్ వీ నాగలక్ష్మీ, ఏఎన్ ఎం సునీత, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానమునకు నాలుగు సీలింగ్ ఫ్యాన్లు బహుకరణ



**గుడివాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** స్థానిక పాటి మీద జగన్నాధపురం లో వేంచేసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానమునకు గుడివాడ వాస్తవ్యులు అడుసుమిల్లి వెంకట శ్రీనివాస సుబ్బారావు శ్రీ స్వామి వారి దేవస్థానం నకు నాలుగు సీలింగ్ ఫాన్స్ బహుకరించారు. ఈ సందర్భంగా దాతకు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి.. ఈ సందర్భంగా శ్రీ స్వామివారి శేష వస్త్రం ప్రసాదం అందజేసినట్టు కార్యనిర్వహణ అధికారి కందులు వేణుగోపాలరావు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం శివరాం ప్రసాద్ చిట్టిబాబు, చందు శ్రీనివాసరావు మరియు మాజీ కౌన్సిలర్లు అడుసుమిల్లి సుబ్రమణ్యం, గొర్రెల పాండురంగారావు మరియు అర్చక స్వామి దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## గుడివాడలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల దాడులు

### -443 సర్వీసులకు అదనపు లోడు నిమిత్తం రూ. 12,86,000/- జరిమానా విధింపు..

**గుడివాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** పట్టణ పరిధిలో విద్యుత్ వినియోగదారుల గృహ మరియు వాణిజ్య సముదాయల పై విద్యుత్ శాఖ విజిలెన్సు అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విజిలెన్సు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ch. వాసు, గుడివాడ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. బి. శ్రీనివాస్ రావు ల ఆధ్వర్యంలో అధికారులు 40 బృందాలుగా ఏర్పడి 3340 గృహ సర్వీస్లు, 396 వాణిజ్య సముదాయలు తనిఖీ చేసినారు. వాటిలో 443 సర్వీసులకు అదనపు లోడు 643 కిలో వాట్లు మొత్తానికి రూ. 12,86,000/- జరిమానా విధించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చేయడం నేరమని, విద్యుత్ చౌర్యము చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపినారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగితే ఈ క్రింది ఫోన్ నంబర్లకు 9440812091, 9440812362, 9440812363 సమాచారం ఇవ్వాల్సిందిగా కోరినారు. ఈ విద్యుత్ విజిలెన్సు తనిఖీలలో గుడివాడ టౌన్ DEE నాగ బాపిరాజు, గుడివాడ D1 AEE K.ఉష మరియు గుడివాడ డివిజన్ పరిధిలో ని DEE లు, AE లు, లైన్ ఇన్స్పెక్టర్ లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ 107వ్యవస్థాప దినోత్సవం



**గుడివాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107వ వ్యవస్థాన దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుడివాడ శాఖలో 107వ వ్యవస్థాప దినోత్సవం శాఖ మేనేజర్ మూడెడ్ల దుర్గాప్రసాద్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1919లో స్థాపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ హై స్కూల్ డైరెక్టర్ బొప్పన వెంకటవిజయభాస్కర్, సత్యనారాయణ, ఆలమూరి మురళీకృష్ణ, బ్యాంక్ సిబ్బంది, పాల్గొన్నారు.

## మెప్మా అధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు



**గుడివాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** స్థానిక కైకల కళామందిరంలో మెప్మా ఆధ్వర్యంలో 30 సంవత్సరలు దాటిన మహిళలలకు ఉచిత మెడికల్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయుకులు చేకూరి జగన్మోహన్‌రావు, పంద్రాజు సాంబశివరావు, డ్వాక్రా మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

## వైభంగా కార్తీక మాసోత్సవాలు



**గుడివాడ,నవంబర్ 11 (వార్తాప్రభ) :** శ్రీ కాశీ విశ్వేశ్వర శ్రీ బాలగణపతి దేవాలయంలో కార్తీక మాసోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పంచహారుతులతో కూడిన విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## కుంటముక్కలలో పొలం పిలుస్తోంది



**జి.కొండూరు,నవంబర్ 11 (వార్తాప్రభ) :** పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు ఏఈఓ నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని కుంటముక్కల గ్రామంలో స్థానిక కూటమి నాయకులు, రైతులతో కలిసి ఖరీఫ్ పంటలను పరిసీలించారు. అనంతరం వచ్చే రబీ సీజన్లో రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో నాగరాజు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ఈశ్వర్, మిల్క్ సొసైటీ అధ్యక్షులు లంక రామకృష్ణ వర ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

# మరోసారి...!

**కలెక్టర్,ఎమ్మెల్యే చెప్పిన, ప్రతిపక్షాలు ఘోషించిన, ప్రజలు రోధిస్తున్న తీరు మార్చుకొని వీటిపిఎస్ అధికారులు**

- హెడ్ వాటర్ వర్క్స్ లోకి చేరిన బూడిద నీరు
- 104 గ్రామాలకు త్రాగునీరు లో బూడిద కలుపుతున్న డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ అధికారులు



**ఇబ్రహీంపట్నం,నవంబర్ 11 (వార్తాప్రభ) :** ఒకసారి జరిగితే పొరపాటు, రెండోసారి జరిగితే తప్పిదం మళ్లీ మళ్లీ అదే జరిగితే నిర్లక్ష్యమా లేక బరితెగింపా డాక్టర్ ఎన్టిపిఎస్ అధికారుల తీరుపై వస్తున్న విమర్శలు ఇవి. ఇబ్రహీంపట్నం డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ సమీపంలో మైలవరం నియోజకవర్గంలోని 104 గ్రామాలకు త్రాగునీరు అందించే ఆర్డబ్ల్యూఎస్ హెడ్ వాటర్ వర్క్స్ ఉంది. కృష్ణానది నుండి వీటిపీఎస్ వెళ్లే కాలువ నుండి ఇక్కడికి నీరు సరఫరా చేస్తారు. గతంలో పలుమార్లు తాగునీళ్లలో బూడిద వదిలారు అధికారులు. దీనిపై ప్రజా సంఘాలు ఆందోళన చేశాయి, కలెక్టర్ లక్ష్మి శా ఆర్డీవో చైతన్యతో సమస్యను పర్యవేక్షించారు. స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అధికారులను హెచ్చరించారు. ప్రజలు త్రాగునీటి కోసం రోధిస్తున్న ఇవేమీ తమకు పట్టవు అన్నట్లు వీటిపిఎస్ అధికారులు బూడిద నీటిని తాగునీటిలోకి వదులుతూనే ఉన్నారు. కాలుష్యంతో వివిధ రోగాలతో అల్లాడుతున్న ప్రజలు, ఇప్పుడు బూడిద కలిసిన నిటిని దాగి ప్రాణాల మీదకి తెచ్చుకోవాలేమోనని ఆవేదన చెందుతున్నారు. పదేపదే జరుగుతుండటం, ఎప్పటికప్పుడు తూతు మంత్రం చర్యలు చేపట్టడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజల కోరుతున్నారు.

## వైభవంగా న్యూ హెూప్ నూతన ప్రార్థనా మందిర ప్రతిష్ఠ మహెూత్సవం




**జగ్గయ్యపేట,నవంబర్ 11 (వార్తాప్రభ) :** మండలం, బండిపాలెం గ్రామంలో న్యూ హెూప్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవ. పి. ప్రభుదాస్, రూత్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో న్యూ హెూప్ నూతన ప్రార్థనా మందిర ప్రతిష్ఠ మహెూత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ , జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొని, ప్రార్థనా మందిరాన్ని ప్రతిష్ఠించి, విశ్వాసులందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్ట వెంకట నరసింహారావు మరియు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తెదేపా నూతన కమిటీలు ఏర్పాటు



**సామర్లకోట,నవంబర్ 11 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణం లారీ యూనియన్ ఆఫీస్ వద్ద గల సూర్య ఫంక్షన్ హాల్ లో తెలుగుదేశం పార్టీ నూతన టౌన్, మండల కమిటీలు, క్లస్టర్స్ వార్డు కమిటీ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దాపురం నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప హాజరయ్యారు. సామర్లకోట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా పి. వేమవరం గ్రామానికి చెందిన ముసిరెడ్డి శ్రీరాములు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అధ్యక్షునిగా తనకు వచ్చిన పదవి సక్రమంగా వినియోగించుకొని మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆదేశాల మేరకు అలాగే పెద్దాపురం నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మకాయల చిన్న రాజప్ప ఆదేశాల మేరకు కట్టుబడి మండల అధ్యక్షునిగా తన బాధ్యతలు నిర్వర్తిస్తానన్నారు. టిడిపి మండల అధ్యక్షునిగా ప్రమాణస్వీకారం చేసి స్వగ్రామం విచ్చేసిన ముసిరెడ్డి శ్రీరాములకు టిడిపి కార్యకర్తలు అభిమానులు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూల మాలలు, దుస్సాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. పండుగ వాతావరణంలో గ్రామస్తులు, టిడిపి కార్యకర్తలు వేడుకలు జరిపారు.

## రైతు నేస్తం రుణాలు 9 మందికి 86 లక్షలు అందజేసిన సొసైటీ అధ్యక్షులు అత్తులూరి...





**పెనుగంచిప్రోలు,నవంబర్ 11 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని అనిగండ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకారక సంఘం నందు కొత్తగా రైతు నేస్తం రుణాలు మంజూరు చేయడం జరిగింది. మంగళవారం 9 మంది సభ్యులకు 86,00,000 /- రూపాయలను సొసైటీ అధ్యక్షులు అత్తులూరి అచ్యుత్ రావు, అందజేశారు. ఈ కార్యక్రమం లో బ్యాంక్ చీఫ్ మేనేజర్ దుర్గా ప్రసాద్ సూపర్వైజర్ బాలాజీ, సెక్రటరీ వెంకట రమణ రావు తదితరులు పాల్గొన్నారు. మరియు ధాన్యం కొనుగోలు కేంద్రం పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది......

## భూసార పరీక్ష పై బి ఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థినులకు అవగాహన




**జి.కొండూరు,నవంబర్ 11 (వార్తాప్రభ) :** భూసార పరిరక్షణ పథకంలో భాగంగా భూసార పరీక్షా కేంద్రం గొల్లపూడి బృందం వారు జి.కొండూరు మండలంలోని కుంటాముక్కల గ్రామ శివారు బి.ఆర్.అంబేద్కర్ గురుకులం ను మంగళవారం సందర్శించారు. గురుకులం విద్యార్థినులకు భూసార పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారిణి పాగోలు ప్రియాంక పాఠశాల విద్యార్థినులు నేలఆరోగ్యం, స్థూల పోషకాలు, సూక్ష్మ పోషకాలు పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ పథకం ద్వారా స్కూల్ లో మినీ సాయిల్ లాబొరేటరీ ప్రభుత్వం అందిస్తుందని, విద్యార్థినులు రైతుల నుంచి మట్టి నమూనాలు సేకరించి విశ్లేషణ చేసి రైతులకి నేలలోపోషకాలు స్థాయిని వివరించి ఎరువులను సిఫారసు చేయాలని తెలిపారు. భూసార పరీక్ష కేంద్ర వ్యవసాయ అధికారి సువర్ణ కుమారి మట్టి నమూనా సేకరణ, సాయి-ల్ హెల్త్ కార్డ్ యాప్ మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సురేష్,పాఠశాల ప్రిన్సిపాల్ కె.బ్యూలా,రైతు సేవా కేంద్ర సహాయకుడు వేములకొండ పవన్ కుమార్, APCNF స్టాఫ్, పాఠశాల ఉపాధ్యాయినులు సరోజినీ దేవి, పద్మజ పాల్గొన్నారు.

## మంత్రి కొలుసు పార్థసారథి నీ ఆహ్వానించిన యాదవ నాయకులు



**విజయవాడ, నవంబర్ 11 (వార్తాప్రభ) :** శ్రీ వేణు తుల కాటంరాజు గంగాభవాని దేవస్థానం వద్ద ప్రకాశం జిల్లా స్థాయి యాదవ సామాజిక వర్గం కార్తీక వనభోజనాల కార్యక్రమం సంబంధించి రాష్ట్ర మంత్రి, యాదవ శ్రేష్ఠ కొలుసు పార్థసారథి యాదవ్ ని ఆహ్వానించిన ప్రకాశం జిల్లా యాదవ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు సిరిపురం వెంకట్రావు యాదవ్ కాటమరాజు దేవస్థాన కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్ యాదవ సంగ శ్రేయోభిలాషి బైరబోయిన చంద్రశేఖర్ యాదవ్ ఒంగోలు అమ్మవారి దేవస్థానం చైర్మన్ గోల్ల వెంకటేశ్వర్లు యాదవ్ , కాటమరాజు దేవస్థాన కమిటీ ఉపాధ్యక్షులు అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ నక్క శ్రీనివాస్ యాదవ్,మోర బోయిన బాబురావు యాదవ్ ,పల్లా నరసింహారావు యాదవ్ ఒంగోలు వీరయ్య యాదవ్ ,తలమల శ్రీనివాస్ యాదవ్, నరసింహారావు యాదవ్ తదితర యాదవ సంఘం బాధ్యులు. మంత్రిని ఆహ్వానించిన పిమ్మట రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్ యాదవ్ వారిని కూడా కలిసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా నాయకులు తాము వీలునంతవరకు తమ ప్రాంతాల్లో ఉన్నటువంటి కార్యక్రమాలను చూసుకొని కాటమరాజు దేవస్థానం వద్దకు చేరుకుంటామని తెలియపరిచారు.

## కుటుంబ సంక్షేమ పథకంలో చేరిన నూతన ఉపాధ్యాయులు



**గిద్దలూరు, నవంబర్ 11 (వార్తాప్రభ) :** గిద్దలూరులోని యు.టి.ఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి మండలాధ్యక్షులు డాక్టర్ మొర్రి.పిచ్చయ్య అధ్యక్షత వహించారు. నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్ల పంపిణీ తోపాటు వీరికి శాలరీ చేయుటకు అవసరమైన యాక్ట్-2 ఫామ్స్ ను కూడ అందజేశారు. ఈ సమావేశంలో కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య ముఖ్య అతిథిగా పాల్గొని కుటుంబ సంక్షేమ పథకం వలన కలిగే ప్రయోజనాలను నూతన ఉపాధ్యాయులకు వివరించారు. అనంతరం ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా నియమితులైన నూతన ఉపాధ్యాయులను మరియు పనిచేస్తున్న ఉపాధ్యాయులను కూడా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుటుంబ సంక్షేమ పథకంలో సభ్యులుగా చేర్పించడం జరిగినది. కుటుంబ సంక్షేమ పథకం అనేది రాష్ట్రంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘం మాత్రమే నిర్వహిస్తుందని ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ సుబ్బరాయుడు, సంఘ నాయకులు బాల వెంకటేశ్వర్లు, ఆవుల రాజు ,హాకీం, మస్తాన్, వెంకటేశ్వర్ రెడ్డి, మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా అయ్యప్ప స్వామి పడి పూజలు





**హైదరాబాద్,నవంబర్ 11 (వార్తాప్రభ) :** గచ్చిబౌలి డివిజన్ నేతాజీ నగర్ కాలనీ శ్రీ భగవతి రేణుక ఎల్లమ్మ నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో అన్నదొరా స్వామి బసవమ్మ కన్య స్వామి కుటుంబ సభ్యుల అయ్యప్ప స్వామి మహా పడిపూజ గొప్ప మాన్యశ్రీ ఉమామహేశ్వర్ గురుస్వామి అయ్యప్ప స్వామి పూజ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ప్రస్తుత కార్పొరేటర్ వి జగదీశ్వర్ గౌడ్ , బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్. నాయకులు రాగం దయాకర్ యాదవ్. బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ ఈశ్వరయ్య మారుతి మరియు కాలనీ పెద్దలు అయ్యప్ప స్వాములు యువజన నాయకులు మహిళా సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని అయ్యప్ప స్వామి వడి పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించినారు. స్వామియే శరణమయ్యప్ప స్వామియే శరణమయ్యప్ప శరణం అయ్యప్ప స్వామి నీ కీర్తిస్తూ భజన పాటలతో అమ్మవారి ప్రాంగణం మారు మోగింది. భజన బృందం స్వామి నర్సింగ్ రావు ఆధ్వర్యంలో భజన కార్యక్రమం అయ్యప్ప ప్రార్థన కాలనీలోఆలకించడం జరిగింది. అయ్యప్ప స్వామి పూజ తరువాత భారీ ఎత్తున భోజనాలు ఏర్పాట్లు చేసి స్వాములకు మరియు అందరికీ అన్న ప్రసాదం వితరణ చేయడం జరిగింది. అయ్యప్ప స్వాముల వారి భజన కార్యక్రమం అయ్యప్ప నినాదాలతోం నార్సింగి నర్సింగరావు భజన మండలి ఘనంగా అయ్యప్ప స్వామి పాటల ద్వారా భక్తులని స్వామిని అలరించారు ప్రాంగణమంతా మారు మోగిపోయింది. అయ్యప్ప వారి విగ్రహాలను పెట్టి కాలనీవాసులు అయ్యప్ప స్వాములు పెద్దలు ఎంతోమంది పూలతో పూలదండలతో పూజలు చేసి పడిపూజ భోజనాల తర్వాత ముగించడం జరిగింది. అయ్యప్ప స్వామి పడి పూజా కార్యక్రమంలో వేముల కుప్పు స్వామి నేతాజీ నగర్ వాసులుముద్దంగుల అన్న దొర ,చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులు మల్లేష్ ముదిరాజ్ శేర్లింగంపల్లి గోపి నగర్ నల్లగండ్ల గోపనపల్లి వాళ్లు కూడా పాల్గొనడం విశేషం.

## అంచెలంచలుగా ఎదిగిన ఫోటో గ్రాఫర్ పుట్ల నాగేశ్వరరావు

- శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి జానారెడ్డి,ఇతర ప్రముఖులు



**మిర్యాలగూడ, నవంబర్ 11 (వార్తాప్రభ) :** "ఫోటో పత్రిక" మాసపత్రిక వ్యవస్థాపకులు పుట్ల నాగేశ్వరరావు.తొలుత 1985 సెప్టెంబర్ లో ఆర్.యు.యం. ఫోటో స్టుడియో పెట్టారు.నేటి ప్రముఖ కవి రచయిత డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు చేతుల మీదుగా ఆర్.యు.యం. స్టుడియో ను ప్రారంభింపజేయగా మూడుపువ్వులు ఆరుకాయలుగా దినదినాభివృద్ధి చెందుతూ వర్ధిల్లుతోంది.స్టిల్ ఫోటో గ్రాఫర్ గా పేరు తెచ్చుకున్న నాగేశ్వరరావు 2000సం.లో ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ గా ఎదిగి నల్గొండ జిల్లా సమాచార శాఖ కన్సల్టెంట్ 2005 దాక కొనసాగి 2008లో "ఫోటో ఎక్స్ ప్రెస్"పత్రిక నెలకొల్పారు.తర్వాత ఆ పత్రిక నేడు "ఫోటో పత్రిక" పేరుతో నెలనెలా వెలువడే మాసపత్రిక ను నడుపు తున్నారు.ఫోటో పత్రిక జాతీయస్థాయిలో గుర్తింపునొంది అవార్డు కు ఎంపికైనది. 16.11.2025న భువనేశ్వర్ లో జరిగే "నేషనల్ ప్రెస్ డే సెలిబ్రేషన్"సందర్భంగా పుట్ల నాగేశ్వరరావు ను "నేషనల్ అవార్డుకు"ఎంపిక చేసినట్లు, "నేషనల్ జర్నలిస్ట్ వెల్ఫేర్ బోర్డు"భువనేశ్వర్ వారు ధృవీకరణ పత్రం పంపించారు. ఆ సందర్భంగా నాగార్జున సాగర్ లో మాజీమంత్రి జానారెడ్డి ,జెడ్.పి మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి,హాల్యా మార్కెట్ యార్డ్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి ముందస్తుగా అభినందిస్తు నేడు సత్కరించారు.పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

## మోపిదేవి ఆలయానికి భక్తుల రద్దీ..



**మోపిదేవి/అవనిగడ్డ: నవంబర్ 11 (వార్తాప్రభ) :** కార్తీక మాసం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.స్వామివారి ఆరాధనకు మంగళవారం ప్రశస్తమైనదని భక్తుల విశ్వాసం.కార్తీక మాసం మంగళవారానికి ఆశ్లేషా నక్షత్రం కలిసి రావడంతో స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. , డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ కె.వి.ఎన్ . చక్రధర్ బాబు దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. దేవస్థానానికి విచ్చేసిన చక్రధర్ బాబును ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, శ్రీ స్వామి వారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు.

## పీఎం సూర్య ఘర్ యోజన పథకంతో.. ఇక ఫ్రీ కరెంట్ ...!

- 300యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- 78,000 వరకు సబ్సిడీ.



(సి. రాజారెడ్డి, సీనియర్ పాత్రికేయులు, కడప.)

ఇటీవల కరెంట్ బిల్లులు ఏ విధంగా పెరిగిపోతున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు బిల్లు కట్టలేక చాలామంది ఇబ్బంది పడుతున్నారు ఆదాయం తక్కువ ఖర్చులు ఎక్కువ అన్నట్లుగా ప్రజల జీవనస్థితిగతులు మారిపోయాయి చాలీచాలని జీతంతో ఖర్చులు తగ్గించకుండా తగ్గని పరిస్థితుల్లో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు ముఖ్యంగా ప్రతి నెల ఒకటో తారీకు వచ్చిందంటే చాలు కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయి ప్రతినెల ఎంత మీటరు తిరుగుతుంది...? ఎంత బిల్లు వస్తుంది...? అనే ఆందోళన ఎక్కువవుతుంది. అయితే ఇప్పుడు ఆ సమస్యలన్నింటికీ ఫుల్ స్టాప్ పెట్టడానికి ప్రధానమంత్రి సూర్య ఘర్-ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సోలార్ రూఫ్ టాఫ్ లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రాయితీ కూడా అందిస్తుంది. ఈ పథకం కింద ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్ వల్ల వినియోగదారులకు విద్యుత్ బిల్లు నుంచి విముక్తి లభిస్తుందని చెప్పుకోవాలి. ఒకప్పుడు ఐదు నుంచి పదివేల రూపాయలకు పైగా కరెంట్ బిల్లులు కట్టే కుటుంబాలు పీఎం సూర్య ఘర్- ముఫ్త్ బిజిలి యోజన పథకముతో జీరో గా మారాయి అంటే అతిశయోక్తి కాదు. విద్యుత్ వినియోగదారులకు కరెంట్ బిల్లు నుంచి విముక్తి కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వము ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని కొత్తగా ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద 75 వేల సబ్సిడీతో సోలార్ రూఫ్ టాప్ సామర్థ్యంలో వాటాను పెంచడానికి మరియు నివాస గృహాలు వారి సొంత విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి సాధికారిక కల్పించడానికి 29 ఫిబ్రవరి 2024న ప్రధానమంత్రి సూర్యా ఘర్- ముఫ్తీ బిజలీ యోజన పథకాన్ని భారత ప్రభుత్వం ఆమోదించింది ఈ పథకాన్ని జాతీయస్థాయిలో నేషనల్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ (NPIA) ఏజెన్సీ మరియు రాష్ట్రస్థాయిలో స్టేట్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీలు (SIAలు) అమలు చేస్తారు. డిస్ట్రిబ్యూషన్ ఇటిలిటీ (డిస్కములు లేదా పవర్ /ఎనర్జీ డిపార్ట్మెంట్లు, సందర్భానుసారంగా ) రాష్ట్రం/ యుటి స్థాయిలో స్టేట్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీలు (SIA)లుగా ఉంటారు. ఈ పథకం కింద, డిస్కా ములు తమ సంబంధిత ప్రాంతాల్లో రూఫ్ టాప్ సోలార్న్ ప్రోత్సహించడానికి నెట్ మీటర్లు లభ్యత, సకాలంలో ఇన్స్టాలేషన్లను తనిఖీ చేయడం, మరియు ప్రారంభించడం, వెండర్ రిజిస్ట్రేషన్ మరియు మేనేజ్ మెంట్, సోలా రైజింగ్ కోసం ఇంటర్ డిపార్ట్మెంట్లో కన్వర్షన్ వంటి అనేక సులభతరమైన చర్యలను అమలు చేస్తారు.

**ప్రధానమంత్రి సూర్య ఘర్- ముఫ్తి బిజిలి యోజన ఎలా పనిచేస్తుంది.:-** ఈ పథకం రెండు కిలోమీటర్ల సామర్థ్యం గల సిస్టములకు సోలార్ యూనిట్ ధరలు 60 శాతం అలాగే రెండు నుంచి మూడు కిలోవాట్ల సామర్థ్యం మధ్య సిస్టములకు ఆదనపు సిస్టం ఖర్చులో 40 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుంది. సబ్సిడీని మాత్రం మూడు కిలో వాట్లా సామర్థ్యానికి పరిమితం చేశారు. ప్రస్తుతం బెండు మార్కు ధరల ప్రకారము దీని అర్థం ఒక కిలో వాట్ సిస్టంకు రూ. 30000, వేలు రెండు కిలోవాట్ల సిస్టంలకు రూ. 60000 వేలు, మరియు మూడు కిలోవాట్ లేదా అంతకంటే ఎక్కువ సిస్టమునకు రూ.78000 వేల సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఉదాహరణకు మూడు కిలో వాట్ల సిస్టమ్ కు రూఫ్ టాప్ సోలార్ ను ఇన్స్టాల్ చేయడానికి ఒక లక్షా45,000 ఖర్చు అయిందనుకున్నప్పుడు అందులో 78000/- రాయితీని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుంది. కాబట్టి మిగిలిన 67000 కూడా బ్యాంకు నుంచి తక్కువ వడ్డీకి పొందవచ్చు. నెలకు 50 యూనిట్ల విద్యుత్తు వాడే వారికి ఒక కిలో వాటి నుంచి రెండు కిలోవాట్లు రూడాస్ సోలార్న్ ఇన్స్టాల్ చేసుకోవచ్చు అయితే 150 యూనిట్ల నుంచి 300 యూనిట్లకు ఉపయోగించుకునే వారికి రెండు కిలో వాట్స్ నుంచి మూడు కిలో వాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్ టాప్ సోలార్ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. మిగిలిపోయిన యూనిట్లను విక్రయించుకునే సౌలభ్యం కల్పించారు.

**ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎవరు అర్హులు?** దరఖాస్తుదారు తప్పనిసరిగా భారతీయ పౌరుడై ఉండాలి సోలార్ ప్యానల్స్ ను అమర్చుకోవడానికి అనువైన పైకప్పు ఉన్న ఇంటిని కలిగి ఉండాలి ఇంటికి చెల్లుబాటు అయ్యే విద్యుత్ కనెక్షన్ ఉండాలి. సౌర ఫలకాల కోసం గృహస్తులు మరే ఇతర సబ్సిడీని పొంది ఉండకూడదు. సొంత గృహము ఉండాలి.

**పి.ఎం. సూర్య ఘర్ ముఫ్తీ- బిజిలీ యోజన కోసం ఎలా దరఖాస్తు చేయాలి:-** ఆన్లైన్ దరఖాస్తులను నేషనల్ పోర్టులో (https :pm Suryaghar.gov.in) లో సమర్పించవచ్చు దరఖాస్తు చేయడానికి ఆరు నెలలకు తక్కువ కాకుండా విద్యుత్తు బిల్లు కాపీ జత చేయాలి. ఈ పథకం వ్యక్తిగత నివాస మరియు సమూహ గృహ కామన్ సర్వీస్ లకు వర్తిస్తుంది. దరఖాస్తును సమర్పించి డిస్కం క్లియరెన్స్ పొందిన తర్వాత వినియోగదారులు నమోదు చేసుకున్న విక్రేతల నుంచి సోలార్ ప్లాంట్ ను ఇన్స్టాల్ చేసుకోవాలి .పని పూర్తి అయిన తర్వాత వినియోగదారుల నెట్ మీటర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి. నెట్ మీటర్ను అమర్చిన తర్వాత వినియోగదారుడు పోర్టల్ లో బ్యాంకు ఖాతా వివరాలను అప్లోడ్ చేయాలి. సబ్సిడీ 30 రోజుల్లోగా చెల్లించబడుతుంది. అలాగే ఒక సోలార్ రూఫ్ టాఫ్ ప్యానెల్స్ ను ఇన్స్టాల్ చేయడానికి అవసరమైన సుమారుగా పైకప్పు మీద పది చదరపు మీటర్ల స్థలం ఉండాలి. ఒక రూఫ్ టాప్ కెపాసిటీ కోసం సుమారు మూడు నుంచి నాలుగు ప్యానెల్లు, ఒక మీటరు వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తు కొలతలో అమర్చబడుతాయి.

**పథకం ఉపయోగములు:-** ఒక కిలోవాటు సోలార్ రూఫ్ టాఫ్ ప్యానెల్స్ నెలకు దాదాపు 125 యూనిట్లను ఉత్పత్తి చేస్తుంది. కాబట్టి వినియోగదారు డిస్కం నుంచి విద్యుత్తు బిల్లును పొందుతారు. సోలార్ రూఫ్ -టాప్ ప్యానెల్సు సూర్యుని వేడిని పెంచుకోవడం వల్ల ఇల్లు చల్లగా ఉంటాయి. రూఫ్- టాప్ ప్యానెల్స్ చుట్టూ చల్లటి గాలి ఉంటుంది. విద్యుత్ వినియోగదారుడు ఐదు నుంచి ఆరు సంవత్సరాల లోపు మూలధన వ్యయాన్ని తిరిగి పొందుతారు.

**గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేస్తాం:-**నాగముని స్వామి ప్రధానమంత్రి సూర్య ఘర్- ముఫ్తీ బిజిలీ యోజన పథకం, గురించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయబోతున్నట్లు ఏపీ సిపిడిసిఎల్ లక్కిరెడ్డిపల్లి సబ్ డివిజన్ ఏడి నాగమూణి స్వామి తెలిపారు. ఇప్పటికే ఈ పథకంపై సోషల్ మీడియాలో వివిధ మాధ్యమాలలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుంటే జీరో విద్యుత్ బిల్లు వస్తుందన్నారు. ఈ పథకం విద్యుత్తు వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఆసక్తిగల వినియోగదారులు ఈ పథకాన్ని తప్పని సరిగా వినియోగించుకోవాలని అయన కోరారు. అదే కాకుండా ప్రభుత్వం కూడా సబ్సిడీ ఇస్తుంది .సబ్సిడీతో పాటు బ్యాంకులు కూడా తక్కువ వడ్డీతో లోన్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188